మన రైతువాణి

మాసపత్రిక, జూన్, 1993



వరి పంట ఉత్పత్తి విస్తీర్ణం, దిగుబడి వివరాలు

సంవత్సరం	విస్తీర్ణం (మిలియన్ హెక్టార్లు)	ఉత్పత్తి మిలియన్ టన్నులు	దిగుబడి ఎకరాకు
1980-82	40.15	53.63	1.34
1985-86	41.14	63.84	1.55
1986-87	41.17	60.56	1.47
1987-88	38.81	56.86	1.47
1988-89	41.74	70.49	1.69
1989-90	42.17	73.80	1.75
1990-91	42.60	74.59	1.75

దేశంలో ఆహార ధాన్యాలు సేకరణ – వినియోగం వివరాలు (లక్షం టన్నులు)

వివరం	1989–90	1990–91	1991–92
సేకరణ :			
బియ్యం	11.2	12.8	10.5
గోధుమ	9.0	11.1	7.8
మొత్తం	20.2	23.9	18.3
వినియోగం :			
బియ్యం	8.4	7.8	9.9
గోధుమ	7.3	8.3	9.1
మొత్తం	15.7	16.1	19.0
నిల్వలు :			
బియ్యం	7.9	11.2	9.8
గోధుమ	3.6	5.8	2.3
మొత్తం	11.5	17.0	12.1
మొత్తం ధాన్యాల ఉత్పత్తి	171.0	176.2	172.6

ఎరువుల వాడకం

వివరం	హెక్టారుకు సగటున కి.లలో	వివరం	హెక్టారుకు సగటున కి.లలో
ప్రపంచంలో	97.0	రాష్ట్రాలు	
భారతదేశం	68.7	పంజాబ్	171
యూరప్	200.0	హర్యానా	128
పాకిస్తాన్	89.0	ఉత్తరప్రదేశ్	90
బంగ్లాదేశ్	99.3	తమిళనాడు	115
		ఆంధ్రప్రదేశ్	133

రైతాంగ ఉద్యమ ఆణిముత్యం

పుతుంబాక వెంకటపతికి జోహార్లు

ఆంధ్రప్రదేశ్ రైతు ఉద్యమం ఒక ఆణి ముత్యాన్ని కోల్పోయింది. రైతుల తరుపున పోరాడే ఓ యోధుడు నేల రాలాడు. పీడిత రైతాంగ వాణి మూగ బోయింది.

మే 30వ తేది ఉదయం 8-30 గంటలకు గుంటూరు జిల్లా మార్క్సిస్టు కార్యాలయంలో కామ్రేడ్ పుతుంబాక వెంటకపతి తన దిన చర్యకు సమాయత్త మౌతుండగా హఠాత్తుగా గుండెపోటు వచ్చి మనకు శాశ్వతముగా దూరమై పోయారు. ఈ వార్త నిజానికి ఎవరికీ నమ్మబుద్ధి కాలేదు. అందరిని దిగ్భ్రమలో ముంచింది.

అంతకు రెండు రోజుల ముందు చీరాలలో విద్యార్థులకు క్లాసులు చెప్పారు. తిరిగి వచ్చి 88 తాళ్ళూరులో అమర వీరుల సభకు అర్థరాత్రి వరకు సమీకరణ ప్రయత్నము లో మునిగి పోయారు. ఆ సభకు ముఖ్య అతిథిగా హాజరు కావల్సి వున్న కామ్రేడ్ భీమిరెడ్డి నర్సింహారెడ్డి ఆఖరికి వెంకటపతి గారి అంత్యక్రియలకు హాజరు కావాల్సిన దురదృష్టకరమైన పరిస్థితిని ఎదుర్కొన్నారు.

కామ్రేడ్ వెంకటపతి గుంటూరు జిల్లా సత్తెనపల్లి తాలూకా ఊటుకూరు గ్రామంలో 1930లో జన్మించారు. చిన్న వయస్సులోనే ప్రజా ఉద్యమాల్లోకి వచ్చారు. భగత్ సింగ్ పురితీత, ఫాసిస్టు వ్యతిరేక పోరాటం, క్విట్ ఇండియా ఉద్యమాల నుండి స్ఫూర్తి పొందారు. బ్లాక్ మార్కెట్‌కు వ్యతిరేకంగా, వ్యవసాయ పరికరాల కోసం జరిగిన ఆందోళనల్లో పాల్గొన్నారు. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలో స్వయంగా పాల్గొన్నారు. 1948లో కమ్యూనిస్టు పార్టీలో సభ్యులైనారు. ఐదేళ్ళు అజ్ఞాత వాసములో గడిపారు. బంజరు భూముల పోరాటంలో 10 నెలలు జైలు శిక్షకు గురైయ్యారు. అధిక శిస్తులకు వ్యతిరేకంగా సత్యాగ్రహం చేసి 3 నెలలు జైలులో గడిపారు. 1953లో ఊటుకూరు గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైయారు. 1981లో ఫిరంగి పురం సమితి అధ్యక్షునిగా, 85లో శాసన సభ్యునిగా ఎన్నికై ప్రజలకు ఎనలేని సేవ చేశారు.

రాష్ట్ర రైతాంగ ఉద్యమ నాయకుల్లో ఒకరు. రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షునిగా, అఖిల భారత కిసాన్ సభ కౌన్సిల్ సభ్యునిగా ఎన్నో ఏళ్లు పనిజేసారు. కామ్రేడ్ వెంకటపతి జిల్లా రైతుసంఘ అధ్యక్షునిగా ఎన్నో ఉద్యమాలు ప్రత్యక్షంగా నాయకత్వం వహించి, నడిపారు. వారులేని లోటు తీరేది కాదు.

కామ్రేడ్ వెంకటపతి మృతికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, మన రైతువాణి తీవ్ర సంతాపాన్ని ప్రకటిస్తున్నవి. వారి సతీమణి కామ్రేడ్ భారతి (రాష్ట్ర రైతుసంఘ కార్యవర్గ సభ్యురాలు)కి, కుమారులకు తీవ్ర సానుభూతిని ప్రకటిస్తున్నాం.

మన రైతువాణి

(మాస పత్రిక)

1993, జూన్

సంపుటి : 4 సంచిక : 6

వెల : రు. 3.00 పేజీలు : 28



సంపాదకవర్గం :

బోడేపూడి వెంకటేశ్వరరావు

భీమిరెడ్డి నరసింహారెడ్డి

పి. మధు

వి. శ్రీనివాసరావు

(ఎడిటర్)

చిరునామా :

ఎడిటర్, మన రైతువాణి

30 ఎ, పాత ఎం.ఎల్.ఏ. క్వార్టర్స్,

హిమాయత్‌నగర్, హైదరాబాద్-29.

గమనిక : చెక్కులు, డి.డి.లు మన రైతువాణి పేరుతో పంపగలరు.





లోపలి పేజీల్లో.....

జోహార్లు 1

మనం - మన పంటలు 3

జీడి మామిడి 8

పశ్చిమ గోదావరి జిల్లా సమాచారం . 11

చరిత్ర పుటలు 12

వర్షపాతాన్ని ఎలా కొలుస్తారు 14

నాగస్వరం పాములకు వినిపిస్తుందా . 15

కౌల్దారీ చట్టాలు 17

ఉద్యమించిన రైతాంగం 18

కోళ్ళ పెంపకం 20

ముప్పారం గ్రామ కథ 21





రైతాంగ పోరాట యోధుడు

కా॥ పుతుంబాక వెంకటపతికి

ఈ సంచిక అంకితం.

Laser Typesetting : **Shravani Graphics**, 3-4-610/3, Lane opp. to Deepak Mahal Bus stop, Narayanguda, Hyderabad - 500 029.

పైర్ల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

జొన్న

వర్షాదార ప్రాంతాల్లోని పైర్లలో జొన్న చాలా ముఖ్యమైనది. దీనిని కందితో మిశ్రమ పంటగా అంటేప్రతి రెండు జొన్న సాళ్ళకు ఒక కందిసాలుగా ఖరీఫ్ కాలంలో పండిస్తారు. ఈ మిశ్రమ పంట వర్షాధార ప్రాంతాల్లో చాలా లాభసాటి అని తేలింది. బరువైన నల్లరేగడి భూములు, వర్షాధార ప్రాంతాలు ఈ పైరుకు అత్యంత అనుకూలమైనవి. తేలకపాటి ఎర్రనేలలో కూడా సాగుచేయవచ్చు.



ఖరీఫ్ వేసవిలో నీటి పారుదల క్రింద, తెలంగాణాలోని ఎక్కువ ప్రాంతాలలో 100 రోజుల పంట వ్యవధితో సి.ఎస్.హెచ్-1, రకం అనుకూలమైనది. అయితే సి.యస్.హెచ్-5 రకం అన్ని కాలాలకు అనుకూలమైనదిగా పేర్కొనబడినది. 105-110 రోజుల పంట కాలంతో, వర్షాలకు కంకి నల్లబడే బూజు తెగులు దీనికి ఆశించడం తక్కువ. సి.యస్.హెచ్-9 రకం అన్ని కాలాలకు అనుకూలంగా వుండి 105-110 రోజుల పంట కాలంతో కోతకు వస్తుంది. ఈ రకం కూడా గింజపై వచ్చే బూజు తెగులును తట్టుకోగలదు. అయితే సి.యస్.హెచ్-5 రకం కంటే అధిక దిగుబడిని ఇస్తుంది. పైన పేర్కొన్న వన్నీ హైబ్రిడ్ రకాలు. ప్రతి సంవత్సరం విత్తనాలు కొనివేయవలసి ఉంటుంది.

సి.యస్.వి. - 11 (యస్.ఎ.వి.-462) రకం 105-110 రోజుల పంట వ్యవధిలో రబీ, ఖరీఫ్ పంట కాలాలకు అనుకూలమైనది. చొప్ప పశువులు తినుటకు అనుకూలం. మోతి మాఘ రకం జొన్న ఆకుమచ్చ మరియు మల్లెను తట్టుకోగలదు. సంధ్యాల తెల్ల జొన్న-1 (యస్.జె.-2092) రకం మాఘీ మరియు రబీలకు అనుకూలమైనది. ఇది బెట్ట తట్టుకోగలదు. నంద్యాల తెల్ల జొన్న-2 అనే రకం 95-100 రోజుల కాల వ్యవధితో మాఘీ రబీలకు అనుకూలమైనది. దాని గింజలు తేలికగా రాలుతాయి. యన్-13 (పచ్చజొన్న రకం మాఘ, రబీలలో సాగుకు అనుకూలంగా వుంటూ, మల్లెను బెట్టను బాగా తట్టుకోగలదు.

ఎకరానికి 3 నుండి 4 కిలోల విత్తనాలు అవసరమవుతాయి. విత్తనాల ద్వారా వ్యాపించే తెగుళ్ళను థైరమ్ లేదా ప్యాప్టాన్ మందును 3 గ్రాములు కిలో విత్తనాలతో కలిపి శుద్ధిచేసి నివారించవచ్చును. సాళ్ల మధ్య 45 సెంటీమీటర్ల (ఒకటిన్నర అడుగు) దూరం మరియు మొక్క మొక్కకు 15 సెంటీమీటర్ల దూరం వుండేటట్లు పైరును వేయాలి.

వర్షాధార పంటకు ఎకరానికి 4 టన్నుల పశువుల పెంట అంటే సుమారు 8 బండ్లు ఆఖరి దుక్కిలో కలియ దున్నాలి. సుమారు 25 నుండి 32 కిలోల సమానమైన నత్రజని, 16 కిలోల పాస్ఫరస్ మరియు 12 కిలోల పొటాష్‌కు సమానమైన రసాయనిక ఎరువులను వేయాలి. నత్రజని ఎరువును రెండు సమానమైన వాయిదాలలో వేయాలి. మొదటి భాగం నత్రజని పూర్తి పాస్ఫరస్, పొటాష్ ఎరువులను విత్తే సమయంలోనూ, రెండవ భాగం నత్రజని పంట మోకాలెత్తు పెరిగినపుడు వేయాలి. నీటి పారుదల క్రింద పైరును వేసినపుడు ఎకరానికి 4 టన్నుల పశుల పెంటను భూమిలో కలిసేలా ఆఖరి దుక్కిలో వేయాలి. అలాగే 32 నుండి 40 కిలోల నత్రజని ఎరువును, 24 కిలోల పాస్ఫరస్ మరియు 16 కిలోల పొటాష్, లేదా సమానమై ఎరువును వాడాలి. సగం నత్రజనిని, పూర్తి పాస్ఫరస్, పొటాష్ ఎరువులను

విత్తే సమయంలో వేయాలి. మిగిలిన సగం నత్రజనిని విత్తిన 30-35 రోజుల తర్వాత కలుపుతీసి వేయవలసి వుంటుంది.

నీటి పారుదలా సౌకర్యంతో సాగుచేసి నపుడు తేలిక నేలల్లో వారానికి ఒకసారి, నల్ల రేగడి నేలల్లో 15 రోజుల కొకసారి తడి ఇవ్వాలి. అధిక దిగుబడులకు పూత సమయంలో మరియు గింజ పాలు పోసుకొనే సమయంలో నీరు కట్టాలి. విత్తిన 20 రోజులకు గుంటక లేదా దంతెతో అంతర కృషి వల్ల కలుపు నియంత్రణ చేయడమే కాకుండా భూమిలో పదును (తేమ) నిలిచి ఉండేలా చేస్తుంది.

మొవ్వు తొలిచే పురుగు బారి నుండి పైరును రక్షించుకోవడానికి, తొలకరి వర్షాలు పడగానే, లేదా జూలై మొదటి వారం లోపల పైరును వేయాలి. ఆలస్యంగా పైరును వేసినపుడు కార్బోఫ్యూరాన్ గుళికలు ఒక మీటరు సాలుకు 2 గ్రాముల వంతున సాళ్లలో విత్తేటపుడు వేయాలి. లేదా ఎండో సల్ఫాన్ 35 ఇసి మందును ఒక లీటరు నీటికి రెండు మిల్లీ లీటర్లు కలిపి విత్తిన 7, 14, 21 రోజుల కొకసారి పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగును నియంత్రణ చేయడానికి కార్బోఫ్యూరాన్ గుళికలను ఎకరానికి 4 కిలోలను విత్తనం మొలకెత్తిన 35 రోజుల తర్వాత కాండపు సుడులలో వేయాలి. లక్క పురుగు నివారణకు ఎకరానికి 10-12 కిలోల గంధకపు పొడిని గాని, మిథైల్ డమోటన్ 25 ఇసి మందును ప్రతి లీటరుకు 1 మిల్లీలీటరు చొప్పున లేదా 1 పసలోన్ 35 ఇసి మందును ప్రతి లీటరుకు 2 మిల్లీ లీటర్ల చొప్పున డైకోఫాల్ 18 ఇసి మందును లీటరు నీటికి 5 మిల్లీ లీటర్ల చొప్పున కలిపి ఎకరానికి 250 నుండి 320 లీటర్ల ద్రవాన్ని పిచికారి చేయాలి. బూజు తెగులు నివారణకు 0.2 శాతం క్యాప్టాన్ + 200 పిపియం ఆరోఫంగిన్ మందులను గింజపోసుకునే సమయంలో పిచికారి చేయాలి. గింజ గట్టిపడే సమయంలో రెండవసారి ఈ మందులను పిచికారీ చేయాలి.

గింజ గట్టిపడిన తర్వాతనే పంట కోయడం మంచిది. అలాగే తడిగా వున్నప్పుడు కుప్పలుగా పోయరాదు. గింజను ఎండ బెట్టి, గాలి సోకని డబ్బాలలో, లేదా గాదెలలో నిల్వ చేసుకోవాలి. అయితే నెలకొకసారి నిల్వ ఉంచిన గింజలను ఎండలో ఆరబెట్టాలి. ఇలా చేయడం వల్ల పురుగులు ఆశించవు.

మొక్కజొన్న

స్వల్పకాలంలో 85-110 రోజుల్లో కోతకు వస్తూ అధిక ఫలసాయాన్ని, లాభాన్ని సమకూర్చే పంటల్లో మొక్కజొన్న అతిముఖ్యమైనది యాజమాన్య పద్ధతులను బట్టి హెక్టారుకు 45-55 క్వింటాళ్ళ వరకు దిగుబడి నిచ్చే రకాలున్నాయి. ఈ పంటను వర్షాధారంగా గాని, నీటి వసతిలో గాని సేద్యం చేయవచ్చు. దానిని ఖరీఫ్, రబీ లేదా వేసవి కాలంలో, ఎప్పుడైనా పండించ వచ్చును. అయితే చౌడు నేలలు మినహా అన్ని రకాల నేలల్లో ఈ పైరును పండించ వచ్చును తేలికపాటి భూముల్లో నీటి వసతితో బాగా సాగు చేయవచ్చు. అయితే ఈ భూములకు నీరు ఇంకే స్వభావం కలిగి ఉండాలి. నీరు ఇంకని భూములు మొక్కజొన్న సేద్యానికి మంచిది కాదు. తెలంగాణా ప్రాంతంలో, ఖరీఫ్ సీజన్‌లో జూన్ నెలలోను రబీలో అక్టోబర్ - నవంబర్ నెలలో వేయవచ్చు. ఇతర ప్రాంతాలలో ముఖ్యంగా గోదావరి ప్రాంతంలో రబీ పైరును జనవరి వరకు వేయవచ్చు. దానిని వేసవి పైరుగా కూడా వేయవచ్చును. కాని సుంకు అతి వేసవి కాలంలో రాకూడదు.

అధిక దిగుబడికి వివిధ రకాల హైబ్రిడ్ వంగడాలు అందుబాటులో వున్నాయి. హెక్టారుకు 55-60 క్వింటాళ్ళ దిగుబడితో 'డిహెచ్‌యం-103' నీటి పారుదల సౌకర్యంతో 105-110 రోజుల్లో కోతకు వస్తుంది. ఈ రకం మొక్కకుళ్ళు తెగులు, ఆకుమాడు తెగుళ్ళను తట్టుకుంటుంది. ఇటీవలనే రూపొందించ బడిన "త్రిశూలత" హైబ్రిడ్ రకం 110 రోజుల కాల పరిమితితో, నీటి పారుదల సౌకర్యాలుగల భూములకు అనువైనది. ఈ రకం కూడా ఆకుమాడు తెగులు, మొక్కకుళ్లు



తెగులును తట్టుకుటుంది. ఇవియే కాకుండా ఇతర విత్తన వ్యాపార సంస్థలు ఎన్నో హైబ్రిడ్ రకాలను మార్కెట్ లోకి, రైతులకు అందుబాటులోకి తెచ్చాయి. ఈ హైబ్రిడ్ రకాలతో సేద్యం చేసినపుడు విత్తనాలను ప్రతి పైరుకు మార్చాల్సి వుంటుంది. కొద్దిగా తక్కువ దిగుబడి ఇచ్చినా రైతుల తమ విత్తనాలను తామే వాడకోవడానికి సింథటిక్ లేదా కాంపోజిట్ వంగడాలు కూడా వున్నాయి.

వర్షాభావ పరిస్థితులలో నీటి ఎద్దడిని తట్టుకోగల వరుణ రకం 90-100 రోజుల కాలవ్యవధిలో హెక్టారుకు 45-50 క్వింటాళ్ళ దిగుబడి పొందవచ్చు. పొలాలకు పనికి వచ్చే మొక్కజొన్న రకం "అంబర్ పాప్ కార్న్" నీటి పారుదలా సౌకర్యంతో 90-100 రోజుల కాలవ్యవధితో హెక్టారుకు 30 క్వింటాళ్ళ దిగుబడి ఇవ్వగలదు. దాని దర మామూలు మొక్కజొన్న కంటే ఒకటిన్నర రెట్లధికంగా వుంటుంది. ఇలాగే మాధురి అనే ఆరకం కేవలం 75-80 రోజుల కాలవ్యవధిలో పండి పచ్చకండెలు ఉడికించి తినడానికి చాలా అనువైనవి.

మొక్కజొన్న విత్తుటకు తొలుత 6-8 అంగుళాల లోతులో బాగా దున్నాలి. 60-75 సెంటిమీటర్ల దూరంలో కాలువలు లేదా బోదెల చేయాలి. ఎకరానికి దాదాపు 7 కిలోల విత్తనం అవసరం. విత్తేముందు విత్తనాన్ని 2 నుడి 3 గ్రాముల థైరమ్‌తో శుద్ధి చేయాల్సి వుంటుంది. విత్తనాన్ని బోదెకు ప్రక్కగా 1-2 సెం॥మీ లోతులో చేతితో నాటవలసి వుంటుంది. హైబ్రిడ్ రకాలకు 75 సెం॥మీ దూరంలో బోదెలుంటే మొక్కకు, మొక్కకు 20 సెం॥మీ దూరం వుండాలి. అదే 60 సెంటి మీటర్ల దూరం వున్నట్లయితే 25 సెం॥మీ ఉండాలి. అయితే పేలాల మొక్కజొన్నకు బోదెల మధ్య దూరం 60 సెం॥మీ. ఉన్నపుడు మొక్క మొక్కకు 20 సెం॥మీ ఉండాలి. నీటి పారుదల క్రింద పండించి నపుడు హెక్టారునకు 125 కిలోల నత్రజని, 60 కిలోల ఫాస్ఫరస్ ఉండే రసాయనిక ఎరువులను వాడాలి. నత్రజనిని విత్తేటపుడు, మరియు పంట మొకాలు ఎత్తు పెరిగినపుడు వేయవలసి వుంటుంది - వర్షాధార పైరుగా పండించేటపుడు హెక్టారుకు 60-80 కిలోల నత్రజని 30-40 కిలోల భాస్వరం ఇచ్చే ఎరువు సరిపోతుంది. అవసరాన్ని బట్టి పొటాష్ 40 కిలోల వరకు వేయవచ్చు. పైరు వేసిన 30-35 రోజులకు దంతెతో గాని, లేదా నాగళితో గాని బోదెపైకి తోయాలి.

మొక్కజొన్న జింకు లోపాల్ని తట్టుకోలేదు. ఈ పంటకు పెద్దగా తెగుళ్ళు ఆశించవు. అయితే ప్రధానంగా కాండం తెలిచే పురుగు ఆశిస్తుంది. దానిని నియంత్రణ చేయడానికి విత్తనం మొలకెత్తిన 10 రోజులకు ఎండో సల్ఫాన్ 0.1 శాతం అంటే ఒక లీటరుకు 1 మి.మీ. మందును పిచికారీ చేయాలి. అవసరమైతే 15 రోజుల తర్వాత 4 శాతం ఎండో సల్ఫాన్ గుళికలను ఎకరానికి 2 కిలోల వంతున మొక్కల కాండపు సుడులలో వేయాలి. ఆకుమాడు తెగులును నియంత్రణ చేయడానికి విత్తనాన్ని కాప్టాన్ తో గాని, థైరాన్ తోగాని ఒక కిలో విత్తనానికి 4 గ్రాముల మందు కలిపి శుద్ధి చేయడం ఎంతో మేలు. డైథీన్ (జడ్) - 78 అనే మందును 3 గ్రాములు

With best compliments from :

Phone : 76631

ASHWINI AGRO SERVICES

Plot No. 29, Sithapathi Colony (West Maredpally)
SECUNDERABAD - 500 003. (A.P.)

Authorised Agents A.P. State :

POWER MOBILES (P) LTD., MADRAS
NAVALAKHA AGRO-EQUIPMENTS, PUNE.
RAKI INDUSTRIES , KAKINADA,
HYBRID SEEDS ITC LTD., SECUNDERABAD.
BHAGYANAGAR LABORATORIES, HYDERABAD.

CH. SUDHARSHAN
Proprietor

ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ కూడా చేయవచ్చు.

మొక్కజొన్న కోయడానికి మొక్కజొన్న కండె క్రింది ఆకులు ఎండినట్లు కల్పించినపుడు కండెను కోయాలి. కండెలను 3-4 రోజులు ఎండనిచ్చి తర్వాత గింజల్ని వేరు చేయాలి. కండెల్ని కట్టెతో కొట్టి గాని, యంత్రంతో గాని గింజలను వేరు చేయవచ్చు.

పెసర

స్వల్ప కాలిక పంటలలో పెసర చాలా ముఖ్యమైనది. వర్షాధార ప్రాంతాలలో మాగి జొన్న వేసే ప్రాంతాల్లో మొదటి పైరుగాను, నల్లరేగడి భూముల్లో కందితో మిశ్రమ పైరుగా వేయడానికి మాగాణి ప్రాంతాల్లో (నాగార్జున సాగరు ఆయకట్టు లాంటి ప్రాంతాలు) ఖరీఫ్ వరినాట్లు ఆలస్యంగా వేసే ప్రాంతాలలో తొలకరి వర్షాలతో పైరు వేయడానికి, పెసర సాగు అత్యంత అనుకూలమైనది. పెసరను అన్నిరకాల భూములందు సాగు చేయవచ్చు. కాని చౌడు నేలలు మరియు మురుగు నీరు పోయే వసతి లేని భూములు పెసర సాగుకు అనుకూలం కావు.

ఖరీఫ్, రబీ, వేసవి కాలాల్లో 5 రోజుల పంటకాలంలో సేద్యానికి అత్యంత అనువైన రకం యం.యల్.-2647. మొక్క నిటారుగా పెరిగి, క్రింది నుండి పైదాకా కాపు కాస్తుంది. వర్షాకాలం మినహా మిగిలిన అన్ని ఋతువులలో ఒకేసారి కోతకు వచ్చును. ఎల్లో మొజాయిక్ తెగులను ఈ రకం బాగుగా తట్టుకోగలదు.

ఖరీఫ్, రబీ మరియు వరికోతలు తరువాత 75 రోజుల కాల వ్యవధిలో ఇటీవలే రూపొందించిన పెసర రకం ఎల్ జిజి 410. మొక్కలు నిటారుగా, గుబురుగా పెరుగుతాయి. ఎల్లో మొజాయిక్ తెగులను తట్టుకోగలదు. ఎల్ బిజి 450 రకం

65-70 రోజుల పంటకాలంలో ఖరీఫ్ సేద్యానికి అనువైన రకం. ఈ రకం పంటకొచ్చే సమయంలో వర్షాలు కురిస్తే, కాయలోని గింజలు పాడవకుండా తట్టుకొంటాయి. ఈ రకం కూడా ఎల్లో మొజాయిక్ తెగులును తట్టుకోగలదు.

పై రకాలన్ని హెక్టారుకు 12-16 క్వింటాళ్ల మధ్య దిగుబడి నివ్వగలవు.

ఎకరానికి 6 కిలోల విత్తనాలు సరిపోతాయి. వరి మాగాణుల్లో, వరి తరువాత 12-14 కిలోల విత్తనాలు వేయాల్సి ఉంటుంది. ఆరుతడి పైరుకు 8 కిల్లో విత్తనాలు అవసమౌతాయి. పెసరను క్రొత్తగా వేసిన సందర్భాలల్లో మరియు వరి తరువాత పైరుకు రైజోబియం కల్చరుతో విత్తనాలను కలపాలి. రైజోబియం కల్చరు ఎంపికతో తీసుకోబోయే ప్యాకెట్ పెసర కొరకై ప్రత్యేకంగా రూపొందించిందా లేదా అని తేల్చుకోవాలి. పెసరకై ఉద్దేశించిన దానినేఎంచుకోవాలి.

రైజోబియం కల్చరును విత్తనాలలో కలపడానికి 70 గ్రాముల కల్చరును 300 మి.లీ. వరకు మరిగించి చల్లార్చిన నీరు మరియు 30 గ్రా. తుమ్మజిగురును లేదా బెల్లము గల ద్రావణముతో కలిపి, ఆ మిశ్రమమును 25 కిలోల విత్తనముతో కలపాలి. నీళ్లలో ఈ విధంగా కల్చరు కలిపిన గింజలను ఎండ బెట్టి, మామలూగా పైరు మాదిరిగా విత్తవచ్చు.

సాళ్ల మధ్య 30 సెం.మీ. (ఒక అడుగు) సాళ్లలో మొక్క-మొక్కకు 10 సె.మీ. దూరంలో (4 ఇంచీలు) పెసర్పైరు వేయాలి. పెసరను మాగి జొన్న, ఖరీఫ్ వరి ముందు వేసే సందర్భములో ఎకరానికి 2 టన్నుల పశువుల ఎరువు (సుమారుగా 4 బండ్లు) 8 కిలోల సమానమైన నత్రజని ఎరువు (యూరియా) మరియు 20కిలోల సమానమైన పాస్ఫరస్ ఎరువు (సూపర్) లేదా తత్సమానమైన కాంపెక్స్ ఎరువులు విత్తనములు జల్లే ముందు వేయాలి. వరి కోసిన మాగాణుల్లో ఎరువులు వాడవలసిన అవసరం లేదు.

సామాన్యముగా పెసర వర్షాధారపు పంట. అవకాశం ఉన్న చోట వర్షాధార పరిస్థితుల్లో, ఒకటి రెండు తేలికపాటి తడులు వేస్తే మంచి దిగుబడి వస్తుంది. వరికోసిన పొలము నందు, విత్తిన పైరుకు నీటి తడి అవసరం లేదు. వేసవిలో పండించే పంటకు పైరుకు 25-30 రోజులకొకసారి, 45-50 రోజుల మధ్యలో రెండోసారి తడి ఇవ్వాలి.

పెసర పంటకు మొదటి 30 రోజులు కలుపు లేకుండా, గొర్రుతో రెండుసార్లు అంతర కృషి చేయాలి. వరి మాగాణుల్లో కలుపు తీయవలసిన అవసరం లేదు.

ఒకవేళ గాలిలో తేమ ఎక్కువగా ఉన్నచో, 30-35 రోజుల తరువాత ముదురు ఆకులపై బూడిద తెగులు సోకే అవకాశం ఉంది. దీన్ని బావిస్టిన్ మందును ఒక లీటరు నీటికి ఒక గ్రాము కలిపి లేదా టాప్సిన్ యం. 70, 0.1 గ్రాము లేదా కెరాథెన్ 1 మి.లీ. చొప్పున కలిపి 10-15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసి బూడిద తెగులును నియంత్రణ చేయవచ్చు.

కాయ కోసిన తరువాత, శేషపదార్థాలను చేలోనే దున్ని వేయాలి. భూమిలో చివకటానికి 7-10 రోజులు పడుతుంది. ఇలా చేస్తే భూసారాభివృద్ధి జరుగుతుంది.

కంది

వర్షాధార ప్రాంతాల్లో మిశ్రమ పైరుగా వేసే పంటల్లో కంది చాలా ముఖ్యమైనది. వరి మాగాణి గట్లమీద కూడా దీన్ని పెంచవచ్చు. పల్నాడు (ఎల్.ఆర్.జి-30) రకం ఖరీఫ్‌లో 170-180 రోజుల పంట వ్యవధితోనూ, రబీలో 120-130 రోజుల పంట వ్యవధితో సాగుకు అత్యంత అనుకూలమైనది. ఈ రకం గింజలు మధ్యస్థం లావుగా వుండి గోధుమ రంగు కలిగి ఉంటాయి. మారుతి (ఐ.సి.సి. - 8863) రకం 150-160 రోజుల పంట కాలంతో ఖరీఫ్ సీజనులో మిశ్రమ పంటగా సాగుకు మంచిగా అనుకూల మైనది. ఈ రకం ఎండు తెగులును తట్టుకుంటుంది.

అభయ (ఐ.సి.పి.యల్. - 332) రకం 160-165 రోజుల పంట కాలంతో కాయతొలుచు పురుగును తట్టు కుంటుంది. ఐసిపియల్ - 87 రకం 130-140 రోజుల పంట కాలంతో ఖరీఫ్ సాగుకు అనువైన రకం. మొక్కలు చిన్నవిగా ఉంటాయి. రెండుమూడు ధఫాలుగా కోతకు వస్తుంది. ఈ రకం ఆరుతడి సాగుకు మాత్రమే అనువైనది.

చవిటి నేలలు, నీటి ముంపుకు గురయ్యే నేలలు తప్ప మిగతా అన్ని నేలల్లో కంది పైరు సాగు చెయ్యడానికి అనువైనది. రైజోబియం కల్చరుతో విత్తనాన్ని శుద్ధి చెయ్యాలి. ప్రత్యేకంగా కందికి రూపొందించిన 70 గ్రాముల రైజోబియం కల్చరును 300 మిల్లీ లీటర్ల చల్లార్చిన నీటిలో 30 గ్రాముల తుమ్మ జిగురు లేదా బెల్లం కలిపే మిశ్రమములో 25 కిలోల విత్తనాలను కలిపి నీడలో ఆరనిచ్చి మామూలుగానే విత్తినట్లు చేయాలి. ఎకరానికి ఖరీఫ్‌లో 4 నుండి 5 కిలోలు, రబీలో 16 నుండి 18 కిలోల విత్తనాలు అవసరమవుతాయి. నల్ల రేగళ్లలో సాళ్ల మధ్య 90 సెంటీ మీటర్లు అంటే 3 అడుగులు దూరం, మొక్క మొక్కకు 20 సెంటీమీటర్లు అంటే 8 ఇంచీలు ఉండాలి. అయితే ఎర్రనేలల భూముల్లో సాళ్లమధ్య 60 సెంటీమీటర్లు మొక్క, మొక్కకు దూరం 20 సెం.మీ. ఉండేటట్లు చూడాలి. ఐసిపియల్ - 87 రకాన్ని సాళ్ల మధ్య 45 సెం.మీ. మొక్క మొక్కకు 10 సెం.మీ. దూరం వుండాలి. నాగలితో గాని గొర్రుతో గాని, పైరును వేయవచ్చు.

ఎకరానికి 2 టన్నులు చిలికిన పశువుల పెంట సుమారుగా 4 బండ్లు దుక్కిలో కలియ దున్నాలి. 8 కిలోలకు సరిపోయే నత్రజని ఎరువు (యూరియా) మరియు 20 కిలోలకు సరిపోయే పాస్ఫరస్ ఎరువును (సూపర్ పాస్ఫేట్) లేదా తత్సమానమైన కాంప్లెక్స్ ఎరువును చివరి దుక్కిలో వేయాలి.

కంది ప్రధానంగా వర్షాధారపు మిశ్రమ పంట. తక్కువ కాలపరిమితిగల అపరాలు, తృణ ధాన్యాలు, వేరుశనగ, మొదలగునవి సమాన పంటలుగా వేయవచ్చును. ఉదాహరణకు కంది, జొన్న, లేదా మొక్కజొన్న లేదా సజ్జ లేదా పెసర 1 : 2, కంది, వేరుశనగ 1 : 7 నిష్పత్తులలో వేయవచ్చును. అందువల్ల నీటి అవసరం లేదు. ఐసిపియల్ -87కు తేలికపాటి తడులు ఇవ్వాలి. అంతర కృషిలో భాగంగా కలుపు ఉన్నట్లయితే దంతెతో కలుపును నివారించాలి.

కాయ తొలుచు పురుగు ఇపుడు ప్రధానంగా కంది పైరును నష్టపరుస్తున్నది. దీనిని నియంత్రణ చేయడానికి మోనోక్రోటోఫాస్ మందును 0.05 శాతం లేదా ఎండోసల్ఫాన్ 0.07 శాతం లేదా క్వినాల్‌ఫాస్ 0.05 శాతం మందును మొదట 50 శాతం పూత దశలోనూ, తరువాత 15 రోజులకు మరొక్కసారి పిచికారీ చేయాలి. పురుగు తీవ్రత అధికంగా వున్నట్లయితే ప్రతి 15 రోజుల కొకసారి పై మందులలో ఒక దానిని పిచికారీ చేయాలి.

ఎండు తెగులు ఉండేచోట మారుతి ఐసిపి - 8663 రకాన్ని వేయవచ్చు. ఈ రకానికి కొంత వరకు రోగ నిరోధక శక్తి ఉంది. ఈ జబ్బు నియంత్రణకు, మందులు అంతగా పనిచేయవు.

జీడి మామిడికి శాపం – ప్రభుత్వ నిర్లక్ష్యం

బి. తులసీదాస్,
కార్యదర్శి, శ్రీకాకుళం జిల్లా, రైతుసంఘం

ఏ విందు భోజనం చేసినా, స్వీట్లు తిన్నా అందులో జీడి పప్పు తప్పకుండా ఉంటుంది. మంచి రుచి, వాసన గల పదార్థాల్లో జీడి పప్పు ముఖ్యమైనది. చవులూరించే ఈ జీడి పప్పు తయారీలో (ప్రాసెసింగ్)లో కార్మికుల వేదనలు, జీడి పిక్కలు పండించే రైతుల అవస్థలు తెలుసుకుంటే, ఈ రెండు వర్గాల సంక్షేమం ఏ మాత్రం పట్టని ప్రభుత్వం తీరు పరిశీలిస్తే 'అయ్యో పాపం' అనిపిస్తుంది.

400 ఏండ్ల క్రితం పోర్చుగీసు నావికుల ద్వారా మన దేశానికి (గోవా ప్రాంతం) జీడి మామిడి పంట వచ్చింది. గోవాలో ఉన్న ఆ పంట పశ్చిమ తీరం అంతటా, అనంతరం తూర్పు తీరానికి విస్తరించింది. మెట్టభూములు కొండలు గల త్రిపుర, మధ్య ప్రదేశ్ వంటి రాష్ట్రల్లో నేడు జీడి మామిడి పండిస్తున్నారు. మన దేశంలో సుమారు 13 లక్షల యకరాల్లో జీడి మామిడి పండుతున్నది. ప్రభుత్వ యాజమాన్యంలోని సామాజిక అడవులు మున్నగునవి కాక దేశంలోని రెండు లక్షల రైతు కుటుంబాలవారు ఈ పంటను పండిస్తున్నారు. మన రాష్ట్రం 1 లక్ష 70 వేల యకరాల్లో పండిస్తూ దేశంలోనాలుగో స్థానంలో ఉన్నది. (ప్రథమ స్థానాన గల కేరళలో సుమారు 3 లక్షల 75 వేల యకరాల్లో జీడి మామిడి పండుతున్నది.) జీడి పప్పు ప్రాసెసింగ్ ప్లాంట్లలో 3 లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వార్షిక జీడి పిక్కల ఉత్పత్తి 3 లక్షల టన్నులు. దేశంలోని ప్రాసెసింగ్ ప్లాంట్లకు అది చాలక టాంజానియా, థాయ్‌లాండ్, ఐవరీ కోస్ట్ తదితర దేశాల నుండి పిక్కలు దిగుమతి చేసుకుంటున్నాం. 50 వేల టన్నులు జీడి పప్పు విదేశాలను ఎగుమతి అవుతున్నది. అంతర్జాతీయ వ్యాపారంలో మన వాటా 56% గా ఉంది. తద్వారా 1991-92 ఆర్థిక సం॥లో రూ. 616 కోట్ల విదేశీ మారక ద్రవ్యం లభించింది.

జీడి మామిడి చెట్టు నుండి వచ్చే ఉత్పత్తులన్నీ ఉపయోగకరమైనవే. బీడు భూముల్లో పండించే పంటగా చెప్పు కొనే జీడి మామిడి వాతావరణ సమతుల్యం కాపాడడంలో ముందుంటుంది (ఎక్కువగా ఆకులు కలిగి ఉన్నందున). జీడి పిక్క నుండి వచ్చే పప్పు (Cashew) గురించి చెప్పనక్కరలేదు గాని తొక్క నుండి వచ్చే చమురును రంగుల పరిశ్రమలో ఉపయోగిస్తారు. చమురు తీసాక మిగిలిన గుజ్జు జిగురు పరిశ్రమలోను, చెరగని సిరా తయారీ పరిశ్రమలోనూ ముడిసరుకుగా ఉపయోగిస్తారు. కాగా జీడి మామిడి పంటకు ఎంతో పారిశ్రామిక వినియోగం ఉంది. ఎన్నో పోషక విలువలు కలిగి ఊరగాయ, చట్నీ ఇతర పదార్థాల తయారీకి దీన్ని వాడవచ్చు. కేవలం జీడిపళ్ల ఉత్పత్తుల ద్వారా గోవా ప్రభుత్వం ఎక్సైజు సుంకంగా రు. 60 లక్షలను పొందున్నది. (ఆ రాష్ట్రంలో పండే ప్రతి హెక్టారు తోటకు రు. 350లు చొ॥న వస్తుంది). చివరికి ఎండిపోయిన జీడి మొక్కను వంట చెరకుగా వాడినా అధిక కెలోరీల ఉష్ణాన్ని ఇస్తుందని శాస్త్రజ్ఞులు చెపుతున్నారు.

ఇన్ని ఔపయోగిక విలువలుగల ఈ పంట సాగును గురించి, రైతాంగం పడుతున్న ఇబ్బందులను గురించి, ప్రభుత్వం అందిస్తున్న సహాయం, సహకారాలను గూర్చి చర్చించడం ఈ వ్యాసం ప్రదానోద్దేశ్యం.

పంట పండే తీరు

ఇసుక నేల అయితే ఎకరానికి 40 మొక్కలు, గట్టి నేలలయితే 60 మొక్కల చొ॥న నాటుతారు. నాటిన నాలుగయిదు సంవత్సరాల నుండి కాపు మొదలవుతుంది. 8 నుండి 30 సం" వరకు కాపు బాగుంటుంది. ప్రతి ఏడూ తోటను కనీసం మూడు సార్లు దున్నాలి. నాటిన మొదటి రెండు సంవత్సరాలు మొక్కలను సాకడం ఎంతో కష్టంతో కూడు కున్నపని. కాపు పట్టాక ప్రతి సంవ్సతరం దుక్కి అయ్యాక వర్షాకాలంలోనే మొక్క మొదట మీటరు వ్యాసార్థంతో త్రెంచి త్రవ్వి ఎరువు వెయ్యాలి. నైట్రోజన్, పొటాష్, ఫాస్ఫేటు ఎరువులను వాడాల్సి యుంటుంది. సాధారణంగా జనవరి – ఫిబ్రవరి నెలల్లో పూత ప్రారంభమౌతుంది. మంచు పురుగు ప్రధానంగా ఆశించినందున పూత రాలిపోతుంది. ఈ సమయంలో మోనోక్రోటోఫాస్ వంటి సస్య రక్షణ మందులను చల్లి వలసి యుంటుంది. మొక్క పూర్తిగా పూత తడిసే విధంగా మందు చల్లడానికి పవర్, జెట్

స్ప్రేయర్లు వాడితే ఉపయోగం ఎక్కువ. అయితే అవి అందుబాటులో ఉండడంలేదు.

ఇక, పూత నిలబడి పిక్క కట్టడం మొదలయినప్పటి నుండి పక్షులు విపరీతంగా నష్ట పరుస్తాయి. కాబట్టి పిక్క కట్టడం మొదలైన నుండి ముదిరిన ఆఖరి పిక్క దక్కేవరకు అంటే సుమారు మూడు నెలల పాటు 24 గంటలూ కాపలా కాయాలన్న మాట. జీడి ద్విలింగ పుష్పాలు కలిగి యుటుంది. పంట అంతా ఒకేసారి రాదు. ప్రతి రోజు పండిన పండ్లను (పిక్కలతోసహా) కోయవలసి యుంటుంది. కోసిన పిక్కలను పండ్ల నుండి విడదీసి ఎండ బెడతారు. రైతు ఇంటిల్లిపాదీనాలుగు నెలలపాటు కష్టపడితే ఎకరానికి రెండు నుండి మూడు క్వింటాళ్ల పిక్కలు పండుతాయి (జాతీయ సగటు ఉత్పత్తి హెక్టారుకు 634 కిలోలు) ప్రస్తుతం ధర క్వింటాలుకు సుమారు రెండు వేల రూపాయలు మాత్రమే.

ధర వరలు

పంట దిగుబడిని పెంచడానికి ఎరువుల, పురుగుమందుల వినియోగం ఇటీవల పెరుగుతున్నది. ఫలితంగా ఖర్చులు ఎక్కువ వుతున్నాయి. కాని ధర మాత్రం పెరగడం లేదు. అటవీ శాఖ భూములు మినహాయిస్తే మన రాష్ట్రంలో జీడి పంటను పండిచేది ప్రధానంగా పేద రైతులు. జీడి పంటను దక్కించుకోవడంలో శ్రమ చాలా ఎక్కువ. సముద్ర తీరంలోను, కొండల సమీపంలోనూ ఈ పంట పండిస్తారు. ఈ ప్రాంతాల్లో ఇతర పంటలు ఏవీ దాదాపు పండవు కనక రైతులకు జీవనాధారం జీడి మామిడి మాత్రమే. పంట రాకముందు తమ అవసరాల కోసం డబ్బును జీడి పిక్కల వ్యాపారుల నుండి తీసుకుంటారు. అడ్వాన్సుగా తీసకున్న డబ్బును (వడ్డీతో సహా) తన పంటను అదే వ్యాపారికి (జీడి పిక్కలను) అమ్మి తీర్చు కుంటాడు రైతు. ఈ బలహీనతను ఆధారం చేసుకొని వ్యాపారులు ధరను దిగకోస్తారు. ఎంతన్నా సరే అదే వ్యాపారికి రైతు అమ్మి తీరాలి. పప్పు ప్రాసెసింగ్ చేసే ప్లాంట్ల యజమానులే ఈ జీడి వర్తకులు కావడం యాదృచ్ఛికంగాదు. పంట కాలంలో క్వింటాలు రెండు వేలకు కొని, తర్వాత అక్టోబర్, నంవంబర్ నెలనుండి 3,500 నుండి 4,000కు వ్యాపారులు పెంచుతారు. మన రాష్ట్రంలో ఉత్పత్తి అయిన జీడి పిక్కలో అధిక భాగం కేరళలోని ప్రాసెసింగ్ ప్లాంట్లకు ఎగుమతి అవుతుంది.

వందల కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యం, అమ్మకం పన్ను ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల్ని పొందుతున్నా జీడి రైతుకు మద్దతు ధరను ఇవ్వడంలో మాత్రం ఏమీ శ్రద్ధ కనపర్చడం లేదు. జీడి పిక్కలు కొనడానికి వ్యాపారులకు బ్యాంకులు రుణాలిస్తాయి. గాని ఆ పిక్కలను పండించే రైతుకు మాత్రం పంట రుణాలివ్వవు ధర విషయంలోనే రైతు ప్రధానంగా దోపిడీకి గురవుతున్నాడు. కొనుగోలు చేసే ప్రభుత్వ సంస్థ ఏదీ లేనందున ప్రయివేటు వ్యాపారి దయా దాక్షిణ్యాల మీదనే ఆధారపడ వలసివస్తున్నది.

వామ పక్ష ప్రభుత్వ విశిష్టత

ఈ దుస్థితి నుండి రైతాంగాన్ని తప్పించడానికై కేరళలోని వామపక్ష ప్రభుత్వం కేరళ రాష్ట్ర జీడి అభివృద్ధి సంస్థ (కె.ఎస్.సి.డి.సి.) ను ఏర్పరచింది. అనంతరం రాష్ట్రంలో జీడి పంట (పిక్కల)కు దాని గుత్త కొనుగోలుదారు (MOLYPOLY PURCHASER) గా చేస్తూ శాసనం చేసింది. జీడిపిక్కల వ్యాపారం మరియు ప్రాసెసింగ్‌ను కె.యస్.డి.సి. మరియు కేరళ రాష్ట్ర మార్కెటింగ్ ఫెడరేషన్ పరస్పర సహకారంతో నిర్వహిస్తున్నాయి. ఫలితంగా రైతుకు గిట్టుబాటయిన ధర కేరళరాష్ట్రంలో లభిస్తున్నది. పొరుగు రాష్ట్రాల కంటె (నవంబరు, డిసెంబరు నెలల్లో) ధర కొంచెం తక్కువగా అనిపించినా రైతుకు కొనుగోలు గ్యారంటీ, రుణ సౌకర్యం మున్నగు సౌకర్యాలు ఈ రాష్ట్ర ప్రభుత్వ సంస్థ వల్ల లభ్యమవుతున్నాయి. గుత్త కొనుగోలు దారుగా ప్రభుత్వ రంగ సంస్థ యున్నందున ముడి సరుకుకు హెచ్చు పెట్టుబడి పెట్టలేని చిన్న, మధ్య తరహా ప్రాసెసింగ్ ప్లాంటకు జీడి పిక్కలు కూడా లభిస్తున్నాయి. ప్లాంట్లు మూత పడకుండా కార్మికులకు ఉపాధి కలిగే అవకాశం కూడా కలిగింది.

పరిశోధన పెంచవలసిన ఆవశ్యకత

విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించే జీడి మామిడి పంట, దాని ఉత్పత్తులపై తగు పరిశోధన జరగడం లేదు. ఎరువుల వాడకం, సమగ్ర సస్యరక్షణ చర్యలు, అంట్లు కట్టడం తదితర యాజమాన్య పద్ధతులపై ఆధునిక పరిశోదన, ఆచరణాత్మక సలహాలు అందిచడం జరగడంలేదు. అలాగే దేశంలో ఉత్పత్తి అవుతున్న సుమారు 18 లక్షల టన్నుల జీడి పండ్లలో అత్యధిక భాగం వృథాపోతున్నాయి. ఆల్కహాలు పరిశ్రమ, తదితర వినియోగాలకు 15-20 శాతం మాత్రమే వాడబడుతున్నది. ఆల్కహాలిక్ పానీయాలు, శీతల పానీయాలు, చట్నీలు, ఊరగాయాల తయారీకి జీడి పండ్లను వినియోగించవచ్చు. వృథా పోతున్న జీడిపండ్ల నుండి ఎక్సైజ్, ఇతర పన్నుల ద్వారా కేంద్ర, రాష్ట్ర ఖజానాలకు ఏడాదికి 6-7 కోట్లు పొంద వచ్చని ఒక అంచనా. ఇందుకై విస్తృత పరిశోధన, పరిశ్రమల స్థాపన జరగాలి.

అదేవిధంగా అధిక దిగుబడి సాధించడానకి, మేలయిన పెద్ద పిక్కలను, అందులో గుడ్డు పరిమాణం ఎక్కువగా ఉండేరకాల్ని పరిశోధనా స్థానాల్లో రూపొందించ వలసి యుంది. మేలిరకం మొక్కల ఉత్పత్తికి 'అంటు' కట్టే పద్ధతిని విస్తృతంగా చేపట్టాలి. యాజమాన్యపు పద్ధతులకు సంబంధించిన విజ్ఞానం రైతులకు అందవలసియే ఉన్నది.

కేంద్ర, ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీనత

వందల కోట్ల విదేశీ మారక ద్రవ్యం పొందుతూ కేంద్ర ప్రభుత్వం ఆరవ ప్రణాళికలో జీడిపంటకు కేవలం "రెండు" కోట్లు మాత్రమే ఖర్చు చేసిందంటే దాని వైఖరి అర్థమవుతుంది. 7వ ప్రణాళికలో రు. 5 కోట్లు ఖర్చుచేసి, 8 వ ప్రణాళికలో 35 కోట్లు కేటాయించింది. ఇది ఎక్కువలా అనిపించినా, కొబ్బరికి రూ. 100 కోట్లు సుగంధ ద్రవ్యాలకు రు. 150 కోట్లు కేటాయించిన విషయం పరిశీలిస్తే ఇది ఏపాటిదో అర్థం అవుతుంది. అలాగే కేంద్ర ప్రభుత్వ ఆహారం మరియు సహకార శాఖ ఆధ్వర్యంలో మూడు సంస్థలు, వాణిజ్య మంత్రిత్వ శాఖ క్రింద రెండు సంస్థలు జీడిపంట అభివృద్ధి, పరిశోధన, జీడి పప్పు ఎగుమతి కార్యకలాపాలను నిర్వహిస్తుండడమో, పర్యవేక్షించడమో చేస్తున్నవి. కాని వీటి మధ్య సమన్వయం లేదు.

విస్తీర్ణం రీత్యాను, ఉత్పత్తిలోను నాలుగవ స్థానంలో నున్న మన రాష్ట్రంలో ప్రభుత్వ పరంగా జీడి అభివృద్ధిని పర్యవేక్షించే ప్రత్యేక సంస్థ ఏదీ లేదు. పరిశోధనకు వ్యవసాయ విశ్వ విద్యాలయం, విస్తీర్ణం పెంచడానికి అటవీ శాఖ, కొంత భాగం ఉద్యానవన శాఖ కొంత ప్రయత్నిస్తున్నాయి. జీడి పప్పు ఉత్పత్తి, నాణ్యతలను పెంచడానికి, ఎగుమతి వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి ఏ విధమైన చర్యలను తీసుకొనడం లేదు.

మన రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లా 50 వేల యకరాల్లో జీడి పంటతో అగ్రస్థానాన ఉంది. విజయనగరం, విశాఖ, ఉభయ గోదావరులు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలలో ప్రధానంగా జీడి పండుతున్నది. జీడి పప్పు ప్రోసెసింగ్ ప్లాంట్లు శ్రీకాకుళం జిల్లా పలాస, ప్రకాశం జిల్లా వేటపాలెం, తూర్పు గోదావరి జిల్లా తుని, విశాఖ జిల్లా తగరపు వలసల్లో ఉన్నాయి. విదేశాలకు ఎగుమతి చేసే సంస్థలు ప్రధానంగా పలాసలో ఉన్నాయి. మన రాష్ట్రంలోని ప్రోసెసింగ్ ప్లాంట్లలో అత్యధిక భాగం మాన్యుయల్ పద్ధతిలో పనిచేసేవి. అందువల్ల జీడిపప్పు నాణ్యత తగ్గడం, ఉత్పత్తి వ్యయం పెరగటం జరుగుతున్నది కేరళ మాదిరిగా నీటి ఆవిరిని ఉపయోగించే కుక్కర్ పద్ధతి, ఇతర చర్యలను తీసుకొని నాణ్యతను పెంచుకోవలసి యున్నది.

రైతు ప్రస్తుతం పడుతున్న బాధల నుండి విముక్తుడు కావడానికి కేరళ మాదిరిగా ప్రభుత్వ రంగంలో "గుత్త కొనుగోలు సంస్థ"ను ఏర్పాటు చేయాలన్న ప్రధాన డిమాండ్ పై ఆందోళన సాగించాలి. అదేవిధంగా పంట రుణం లేదా పరపతి సౌకర్యం జీడి పంటకు ఇవ్వాలన్నదీ డిమాండ్‌గా ఉండాలి. రైతాంగాన్ని, ఐక్య ఆందోళనకు సమాయత్తం చేయడానికి రైతు సంఘం పూనుకోవాలి.

కేంద్ర ప్రభుత్వ నూతన ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా భారత్ బంద్‌కి పిలుపు – ఏప్రిల్ 15న ఢిల్లీలో జరిగిన వివిధ ప్రజా సంఘాల సదస్సు నిర్ణయం

ఈ దేశాన్ని వినాశం వైపుకి తీసుకెళ్తున్న నూతన పారిశ్రామిక, ఆర్థిక విధానాలను వ్యతిరేకిస్తూ సాగుతున్న దేశ వ్యాపిత ఆందోళన మరొక దశకు చేరుకున్నది. ఇప్పటి వరకు ట్రేడ్ యూనియన్లకే పరిమితమైన స్పాన్సరింగ్ కమిటీలో రైతు, వ్యవసాయ కార్మిక, యువజన, విద్యార్థి, మహిళా సంఘాలు, శాస్త్రవేత్తలు, సాంస్కృతిక బృందాలు కూడా భాగస్వాములైనాయి. అందువలన ఉద్యమం మరింత ఊపుతోను, ఐకమత్యంతోను సాగుతోంది.

ఏప్రిల్ 15న ఢిల్లీలో జరిగిన సదస్సు ఈ క్రింది ఆందోళనా కార్యక్రమాన్ని ప్రకటించింది :

1. రాష్ట్రస్థాయి, జిల్లా, తాలూకా స్థాయి స్థానిక సదస్సులను 93 జూన్ 15వ తేది నాటికి పూర్తిచేయాలి.

2. జులై మాసాంతానికి జాతాలు, పాదయాత్రలు, సభలు, ప్రదర్శనలు, వీధి సమావేశాలు వివిధ రూపాల కార్యాచరణను పూర్తి చేయాలి.

3. 93 ఆగస్టు 19న దేశ వ్యాపితంగా పెద్ద సంఖ్యలో అరెస్టులు కావడం (జైల్ భరో ఉద్యమం)

4. సెప్టెంబర్ 9న భారత్ బంద్, దేశవ్యాపిత పారిశ్రామిక సమ్మె.

ఉక్కు రంగానికి విస్తరించనున్న నూనెగింజల యుద్ధం

యం. కోటేశ్వర రావు

గత కొద్ది సంవత్సరాలుగా ఆర్థిక మాంద్యం, అభివృద్ధి పెరుగుదల రేటు నామమాత్రంగా ఉన్న పశ్చిమ దేశాల్లో రెండేండ్ల నాడు పూర్తి కావలసిన 'గాట్' చర్చలను (ప్రపంచ వాణిజ్య ఒప్పందం) ముగించకుండా ముసుగులో గుద్దులాడుకుంటున్నాయి. ద్వితీయ ప్రపంచ యుద్ధం తరువాత కమ్యూనిజానికి వ్యతిరేకంగా సమన్వయంతో వ్యవహరించిన అమెరికా, ఐరోపా సామ్రాజ్యవాదులు మరోవైపున తమ వాణిజ్య ప్రయోజనాల కోసం కూటములను ఏర్పరిచారు. అందులో భాగంగా ఏర్పడిందే ఐరోపా సమాజం (ఇ.సి.). గత నాలుగు దశాబ్దాలలో అమెరికా - ఇ.సి. మధ్య వాణిజ్య పోటీ విపరీతంగా పెరిగింది.

వర్ధమాన దేశాలలో మార్కెట్లతోపాటు పరస్పరం ఉభయ మార్కెట్లను ఆక్రమించుకొనే క్రమంలో అమెరికా-ఇ.సి. సబ్సిడీలను ప్రవేశ పెట్టాయి. ఒక దశ వరకూ ఉభయులూ పోటీ బడ్డారు. ఎప్పుడైతే అమెరికా వెనుక బడిందో అప్పటి నుండి పేచీలు ప్రారంభమయ్యాయి. 1980 దశకంలో సబ్సిడీలు గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. 1986లో ప్రపంచ వాణిజ్య సాధారణ ఒప్పందపై ఉరుగ్వేలో చర్చలు ప్రారంభమయ్యాయి. వాటినే ఉరుగ్వేదఫా 'గాట్' చర్చలు అంటున్నారు. గాట్ లో వున్న 108 దేశాల మధ్య వాణిజ్యం, ఎగుమతులు, పన్నులు, దిగుమతులు తదితర అంశాలన్నింటి పైన ఒక అవగాహన కుదుర్చుకుంటారు. ఈ చర్చలను నాలుగేండ్లలో ముగించ వలసి ఉండగా ఆరు ఏండ్లు గడుస్తున్నా అతీ గతీ లేదు. వాటిని జయప్రదంగా ముగించటమంటే అమెరికా డిమాండ్లకు తలఒగ్గటంగా కొందరు భావిస్తున్నారు. పై చర్చలలో వ్యవసాయ సబ్సిడీలపై అమెరికన్లు పెద్ద వివాదం లేవనెత్తారు. ఐరోపా సమాజ దేశాలు వ్యవసాయ ఉత్పత్తులకు సబ్సిడీలను యిచ్చి అక్రమం వ్యాపారం పద్ధతులను అవలింభిస్తున్నాయని, అమెరికా ఇ.సి వాణిజ్య సంబంధాలు సక్రమంగా ఉండాలంటే సబ్సిడీలో తగ్గించుతూ ఇ.సి. వ్యవసాయ విధానాన్ని రుపొందించుకోవాలని అమెరికా కోరింది ఆ మేరకు మూడేండ్ల నాడు కొన్ని మార్గదర్శక సూత్రాలను రూపొందించుకున్నారు. అయినప్పటికీ వాటి వలన అమెరికన్లు ఆశించిన ఫలితం దక్కలేదు. ప్రపంచంలో ఖాద్యతైలాలకు మార్కెట్ నిరంతరం పెరగటమే తప్ప తరగడం లేదు. అందువలన నూనె గింజల సాగు లాభ సాటిగా ఉండటంతో ఇ.సి. దేశాలు వాటి ఉత్పత్తిపై కేంద్రీకరించాయి. 1980 ప్రారంభంలో ఇ.సి. నూనెగింజల ఉత్పత్తి ఒడు మిలియను టన్నులు కాగా యీ ఏడాది 13మిలియన్ టన్నులకు చేరింది. ఇందుకోసం రైతాంగానికి 1990లోనే 5 వేల కోట్ల డాలర్లు (మన రూపాలయలలో 150 వేల కోట్ల రూపాయలు) సబ్సిడీగా యిచ్చారు. దీంతో అమెరికాలో విపరీతంగా పండే గింజలకు మార్కెట్ స్తంబించింది. అక్కడి భూస్వాములు ఇ.సి.లో ఉత్పత్తిని 8 మిలియన్ టనుల్నకు తగ్గింప చేయించాలని అమెరికా ప్రభుత్వం పై తెచ్చిన వత్తిడి ఫలితంగా జార్జిబుష్ ఇ.సి. పై వాణిజ్య యుద్ధం ప్రకటించారు. తమ షరతులకు అంగీకరించని పక్షంలో అమెరికాకు వచ్చే వారి ఉత్పత్తులపై 200 శాతం పన్ను విధిస్తానని ప్రటించారు.

దాంతో ఇ.సి. దేశాలు అమెరికాతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఒప్పందం అమలు జరిగితే ఫ్యాన్స్ ఎక్కువ నష్టంగావటంతో మీరు ఒప్పందాన్ని వీటో చేస్తామని ప్రకటించారు. వేలాది మంది ఫ్రెంచి రైతులు అమెరికాకు వ్యతిరేకంగా ప్రదర్శనలు జరిపారు. ఒప్పందం ప్రకారం ఇ.సి. ప్రస్తుతం ఉన్న 15 శాతం తగ్గించుకోవటంతోపాటు ఉత్పత్తిని 8.5 మిలియన్ టన్నులకు పరిమితం చేసుకోవాలి. సబ్సిడీని 20. శాతం తగ్గించాలి.

నూనె గింజల వ్యవహారంలో ఇ.సి. మెడలు వంచటాన్ని గమనించిన అమెరికా ఉక్కు పారిశ్రామిక వేత్తలు ఉక్కు దిగుమతులపై కూడా అపరాధ పన్నులు విధించాలని డిమాండ చేశారు. వాణిజ్య శాఖ అందుకు తల ఒగ్గింది కూడా. 12 దేశాలు (ఆస్ట్రియా, బెల్జియం, బ్రెజిల్, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, స్పెయిన్, స్వీడన్, న్యూజిలాండ్, మెక్సికో, దక్షిణ కొరియా) ఉక్కు ఎగుమతులపై ఒకటి నుండి 59 శాతం వరకు సబ్సిడీలు యిస్తున్నామని అమెరికా ఆరోపించింది. పై దేశాలలోని 19 కంపెనీలు తక్కువ ధరలకు ఉక్కు ఉత్పత్తులను అమెరికా మార్కెట్ లో ప్రవేశపెట్టినందున అమెరికా పారిశ్రామిక వేత్తలకు పోటీ జరిగింది. జనవరి నెలలో టన్నుకు 10 నుండి 20 డాలర్ల వరకు ధరలు పెంచాలని అమెరికన్లు నిర్ణయించారు. అందుకుగాను దిగుమతులపై పన్ను గురించి ఖరారు చేశారు. ఏప్రిల్ 12 నాటికి 12 దేశాలు సబ్సిడీలు రద్దు చేయకపోతే వాణిజ్య యుద్ధం ప్రారంభించారు. ఆ పరిణామాలు మార్చినాటికి పూర్తి కావలసి 'గాట్' చర్చలను ఎంతమేరకు ప్రభావితం చేయగలుగుతాయో చూడవలసిఉంది.

పశ్చిమ గోదావరి జిల్లా రైతాంగ ఉద్యమాలు

ఆర్. సత్యరాయణరాజు

పశ్చిమ గోదావరి జిల్లాలో 1923లోనే కీ.శే. దండు నారాయణ రాజు నాయకత్వాన రైతు సంఘం ఏర్పడింది. ఆనాటి నుండే రైతాంగ ఉద్యమాలు నడుపుతూ ఉండేవారు. 1931లో రీ సెటిల్‌మెంట్ సమస్యపై రాజకీయ విభేదాలు లేకుండా పెద్ద ఎత్తున ఆందోళన చేసి విజయం సాధించారు.

1930 సంవత్సర కాలం జమీందారీ విధానం రద్దుకు రైతు సంఘం నాయకత్వాన ఉద్యమించారు. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలవారు ఈ ఉద్యమంలో నాయకత్వం వహించారు. 1931లో కొమ్మారెడ్డి సత్యనారాయణ మూర్తి, నెక్కలపు వీరయ్య, వెంకటేశ్వర రెడ్డి తదితరులతో చింతలపూడి తాలూకా రైతు సమస్యలపై ప్రచారం చేసి రైతులను సమీకరించారు. మొఖాసాదార్లు రైతుల మీటింగులకు రానివ్వకుండా, కార్యకర్తలకు భోజనాలు పెట్టకుండా అనేక ఆటంకాలు కల్పించారు. అయినా కొమ్మారెడ్డి సత్యనారాయణ మూర్తి నాయకత్వాన రైతులలో జమీందారీ వ్యతిరేక చైతన్యాన్ని పెంపొందించారు. 1937లో జరిగిన ఎన్నికలలో జస్టిస్ పార్టీని, భూస్వాములను ఓడించి కాంగ్రెస్‌ను గెలిపించుటకు కమ్యూనిస్టు పార్టీ కృషి చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రుణ భారం తగ్గింపుకు చట్టం చేయబడింది. రెవెన్యూ మంత్రి ప్రకాశం పంతులు గారి నాయకత్వాన జమీందారీ ఎంక్వయిరీ కమిటి ఏర్పడింది. ఈ పరిణామాలు జమీందారి విధానాన్ని రద్దు చేయాలనే డిమాండ్‌కి మంచి ఊపును తెచ్చాయి.

రాష్ట్ర రైతు సంఘ అధ్యక్షులు కొమ్మా రెడ్డి సత్యనారాయణ మూర్తి, కార్యదర్శి చలసాని వాసుదేవరావు తదితరుల నాయకత్వాన ఇచ్ఛాపురం నుండి మద్రాసు వరకు చారిత్రాత్మకమైన రైతు యాత్ర (పాదయాత్ర) జరిగింది. ఆ సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లాలో రైతు సంఘ దళాలు రైతులలో ప్రచారం చేసి ఆయా తాలూకాలలో గల రైతుల ముఖ్యమైన అవసరాలు, సమస్యలపై పిటీషన్‌లు సేకరించారు. జమీందారీ, ఈనాందారీ సమస్యలేకాక, నీటి వనరులు, ఇతర సమస్యలు అనేకం తీసుకున్నారు. రాష్ట్ర వ్యాపితంగా సేకరించిన పిటీషన్లు రెవెన్యూ మంత్రి ప్రకాశం పంతులుగారికి అందజేయబడ్డాయి. ఈ సందర్భంగా చింతలపూడిలో గారపాటి సత్యనారాయణ, తెన్నేటి వెంకటరత్నంగార్ల నాయకత్వాన 3 వేల మందితోను, పంగిడి గూడెంలో 5,000 మందితోను ప్రదర్శనలు, సభలు నిర్వహించబడ్డాయి. భీమవరంలో మైలవరపు రామారావు, సంకు అప్పారావు గార్ల నాయకత్వాన జమీన్ రైతు మీటింగ్ జరిగింది. వీటి ప్రోత్సాహంతో యం. నాగులపల్లి, వేంపాడు రైతులు తమ పొలాలలోని చెట్లపై తమదే హక్కు అని చెట్లు నరికారు. అందుకు రైతులపైన, కొమ్మారెడ్డి సత్యనారాయణ మూర్తిగారిపైన కేసు పెట్టారు. ఈ కార్యక్రమంలో గారపాటి సత్యనారాయణ, అన్నే వెంకటేశ్వరరావు గార్లు ముఖ్యపాత్ర వహించారు.

కాళీపట్నం రైతు పోరాటం

నరసాపురం తాలూకా కాళీపట్నంలో జమీందారీ బంజరు 700 ఎకరాలు ఉన్నది. దీనిని ఆక్రమించుటకు 1939 మార్చిలో ఉద్దరాజు రామంగారి నాయకత్వాన పోరాటం జరిగింది. 1939 మార్చి 7 నుండి 10 వరకు ప్రతిరోజు 40,50 మంది స్త్రీ, పురుషులు దళంగా వెళ్ళి భూమిని ఆక్రమించారు. వీరందరినీ అరెస్టు చేశారు. చివరి రోజు 400 మంది పాల్గొన్నారు. లాఠీ ఛార్జీలు, అరెస్టులు జరిగాయి. ఈ పోరాటంలో ఉద్దరాజు మాణిక్యాంబ, అల్లూరి అన్నపూర్ణ, భూపతిరాజు లక్ష్మీ నరసరాజు, సంకు అప్పారావు, గొట్టుముక్కల వెంకట్రామరాజు, కృత్తివెంటి వెంకటేశ్వరరావు, మైలవరపు రామారావు మొదలగువారు బాధ్యత వహించారు. జిల్లా కాంగ్రెస్ నాయకత్వం కూడా ఈ పోరాటాన్ని బలపర్చింది. అప్పటికి కమ్యూనిస్టులు కూడా కాంగ్రెస్‌లో పనిచేస్తున్నారు. కాని రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం కాళీపట్నం రైతాంగ పోరాటం హింసాత్మకమని చెపుతూ ఉద్దరాజు

రామంగార్ని కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయటం జరిగింది. ఆ సమయంలో గారపాటి సత్యనారాయణ మొదలైన వారిపై కూడా శిక్షణా చర్యలు తీసుకున్నారు.

1938 లో పోలవరంలో రెబ్బా ప్రగడ మందేశ్వర శర్మ అధ్యక్షతన తాలూకా రైతు మహాసభ జరిగింది. హుకుంపేట జమీందారు ఎన్ని ఆటంకాలు కల్పించినా 1000 మంది రైతులు హాజరయ్యారు. ప్రకాశం కమిటీ రిపోర్టును బలపర్చుతూ మహాసభలో అనేకమంది ప్రముఖులు మాట్లాడారు. దీని ప్రభావంతో జమీందార్లు కాజేసిన భూములను కోయలు ఆక్రమించుటకు విల్లంబులతో సాయుధంగా పోరాడారు. చింతల పూడి తాలూకా పోతుసూరు, ఏలూరు తాలూకా వుప్ప గూడెంలలో మొకాసా అగ్రహారీకులకు వ్యతిరేకంగా పోరాడారు.

రాష్ట్ర వ్యాపితంగా ఉధృతంగా వచ్చిన ఉద్యమాల పర్యవసానంగా రాష్ట్ర ప్రభుత్వం జమీందారీ రద్దు బిల్లును ప్రవేశపెట్టింద. అయితే రెండవ ప్రపంచ యుద్ధం వచ్చి కాంగ్రెస్ మంత్రి వర్గాలు రాజీనామా ఇవ్వటంతో ఈ బిల్లు చట్టం కాలేదు. తిరికి 1946-47 సంవత్సరాలలో జిల్లాలో జమీందారీ వ్యతిరేక పోరాటాలు జరిగాయి. కానూరు, పెండ్యాల లంక పోరాటం, పాలమ్రు రాజా ఆధీనంలో గల 370 ఎకరాలు ఆ గ్రామాల పేదరైతులు, వ్యవసాయ కార్మికులను సమీకరించి జమీందారు ఎన్ని ఆటంకాలు కల్పించినా ఎదుర్కొని ఎర్రజెండాలతో ఊరేగింపుగా వెళ్ళి భూమిని ఆక్రమించటం, పంటలు పండించటం జరిగింది. జమీందారు గ్రామ రైతులపైన, నాయకత్వం వహించిన దేవరకొండ సుబ్బారావు, అన్నే వెంకటేశ్వరరావు గార్లపైన కేసులు పెట్టటం జరిగింది. 1948 లో కాంగ్రెస్ ప్రభుత్వం జమిందార్లకు అనుకూలంగా పేదలపై, రైతాంగంపై పోలీసులు అమానుషంగా సాగించిన నిర్బంధకాండలో దేవరకొండ సుబ్బారావు, ఈడ్పుగంటి పూర్ణ చంద్రరావు గార్లను కాల్చి చంపారు. నరసింహారాజు గార్ని ఎముకలు విరిగేలా లాఠీలతో బాది జైలుకి పంపారు. నిర్బంధ విధానం ఆగిపోయిన తరువాత కూడా కోర్టు ఆర్డరు జమీందారుకు అనుకూలంగా ఉందని కాంగ్రెస్ ప్రభుత్వం 9 నెలలపాటు రిజర్వు పోలీసులను కాపలా పెట్టి భూమిని తిరిగి జమీందారుకి దాఖలు పర్చింది.

గోపాలపుర జమీందారు, అతని అనుయాయులు రైతుల నుండి కాజేసిన భూములను స్వాధీన పర్చుకొనుటకు తీవ్ర పోరాటాలు జరిగాయి. కోయ రైతులు (గిరిజన), పేదలు ఉద్యమించి భూములను ఆక్రమించి పంటలు పండించుకున్నారు. పంటలు కోసుకుంటున్న తరుణంలో జమీందారు రిజర్వు పోలీసులను రప్పించి ఆకస్మికంగా దాడిచేసి, తుపాకి కాల్పులు జరపగా ముగ్గురు రైతులు మరణించారు. దీనికి నిరసనగా రాష్ట్ర వ్యాపిత ఆందోళన జరిగింది. కొందరు కాంగ్రెస్ నాయకులు కూడా కాల్పులను ఖండిస్తూ ప్రచారం చేశారు. వెలివెన్ను, పోతుసూరు, పుప్పగూడెం గ్రామాలలో కూడా జమీందారీ వ్యతిరేక రైతు పోరాటాలు జరిగాయి.

1944లో విజయవాడలో జరిగిన అఖిల భారత రైతు మహాసభ సందర్భంగా జిల్లాలో బ్రహ్మాండమైన ప్రచారం జరిగింది. జమీందారీ వ్యతిరేక పోరాటాలకు ఈ ప్రచారం ఉపయోగపడింది. ఈ కాలంలోనే జిల్లాలో పెదపాడు. వెలివెన్నులలో రైతులకు రాజకీయ తరగతులు జరిగాయి. 1945లో జిల్లా రైతు మహాసభ జిన్నూరులో జరిగింది. 25 వేల మందితో బ్రహ్మాండమైన బహిరంగసభ జరిగింది. ఎడ్లపోటీలు, వ్యవసాయ ప్రదర్శన, వాలంటీర్ల క్రమశిక్షణ, మహాసభ నిర్వహణ, కేంద్ర రాష్ట్ర నాయకుల ఉపన్యాసాలు రైతాంగంలో, ప్రజలలో పెద్ద సంచలనాన్ని కల్గించాయి. జిల్లాలో చారిత్రాత్మక రైతు సభగా ఈ మహాసభ నిలిచింది. రాష్ట్ర వ్యాపితంగా కష్టజీవుల పోరాటాల ఫలితంగా 1947 జమీందారీ విధానం రద్దు చేస్తూ చట్టం తీసుకురాబడింది.

1991-92లో రైతులకు మంజూరైన స్వల్పకాలిక రుణాలు



స్వల్పకాలిక రుణాలు రైతులకు నేరుగా అందవు. ఫెర్టిలైజర్లు, విత్తనాలు, పురుగు మందులు మొదలైన వాటిని కొనుగోలు చేసి రైతులకు పంపిణీ చేయడానికి ఆయా రాష్ట్ర సంస్థలకు మంజూరవుతాయి.

వర్షపాతాన్ని ఎలా కొలుస్తారు ?

డి. నరేందర్, బి.ఇ.

వర్షపాతాన్ని మిల్లీమీటర్లలో గాని సెంటీమీటర్లలోగాని తెలియజేస్తారు. వర్షపాతాన్ని వర్షాన్ని కొలిచే పరికరాల ద్వారా కొలుస్తారు. వీటినే రేయిన్ గేజెస్ (RAIN GAUGES) అని ఆంగ్లంలో అంటారు. భారతదేశంలో రెండురకాలైన పరికరాలు వాడుకలో వున్నవి. ఒకటి నమోదు చేయలేని రెండవది నమోదు చేయగలిగేది. మన దేశంలో మొదటి రకానికి చెందిన వాటినే ఎక్కువగా ఉపయోగిస్తారు. ఈ మొదటి రకానికి చెందిన సైమన్స్ రేయిన్ గేజ్ (SYMON'S RAIN GAGE) ఎక్కువగా వాడకంలో ఉంది.

ఈ పరికరంలో ఒక గరాటు, సీసా, మరియు లోహపు కవచం వుంటాయి. గరాటు కాడను సీసాలో వుంచి ఈ రెండు కూడ లోహపు కవచంలో అమర్చబడి వుంటాయి. ఈ పరికరాన్ని సమతలంగా, నేలమట్టంలో సిమెంట్ ఇసుకతో తయారుచేసిన దిమ్మెలో బిగిస్తారు. నేల మట్టంపై 30.5 సెం.మీ. ఎత్తు కలిగి పై భాగం 12.5 సెం.మీ. వెడల్పులో గుండ్రంగా వుంటుంది. పడిన వర్షపు చినుకులు గరాటుద్వారా సీసాలోకి చేరుతుంది. సీసాలో చేరిన నీరు స్కేలుతో కొలుస్తారు. ఈ పరికరాన్ని చెట్లు, ఇండ్లు లేని బహిరంగ ప్రదేశంలో సమతలంగా వుంచుతారు. ఎందుకంటే చెట్ల ఆకుల మీద, ఇంటి కప్పుల మీద పడిన వర్షం సీసాలోపడి నిజమైన కొలతలు రావు. వర్షపు చినుకులు గాలి ప్రభావం వలన సీసాకు దూరంగా పడకుండా వుండడానికై పరికరాన్ని భూమికి అతి దగ్గరలో వుంచబడుతుంది. ఎందుకంటే గాలి ప్రభావం భూమికి దగ్గరలో తక్కువగా వుంటుంది కాబట్టి. అలాగే భూమి మీద పడిన నీరు సీసాలోకి చేరకుండ తగిన జాగ్రత్తలు తీసుకుంటారు.

ఒకే రీతిలో వుండడానికై దేశ వ్యాప్తంగా ఒకే పద్ధతిలో వర్షపాతాన్ని ప్రతిరోజు ఉదయం 8.30 గం॥లకు నమోదు చేస్తారు. సామాన్యంగా సీసాలో 10 సెం.మీ. కంటె ఎక్కువగా వుండదు: ఒకవేళ భారీ వర్షపాతమైతే రోజుకు రెండు లేక అంతకంటే ఎక్కువ సార్లు కొలతలు తీసుకొని వాటి మొత్తాన్ని ఆ రోజు వర్షపాతంగా తెలియచేస్తారు. కాని చివర కొలత మరుసటి రోజు ఉదయం 8.30 గం॥లకే తీసుకోవాలి. నమోదు



సైమన్ రేయిన్ గేజ్

(SYMON'S RAIN GAUGE)

చేసే రెండవరకానికి చెందిన ఆటోమేటిక్ రేయిన్ గేజ్ (AUTOMATIC RAIN GAUGE) లలో వర్షపాతం కాగితం మీద దాని అంతట అదే నమోదు చేయబడుతుంది. ఈ విధంగా మన దేశం లో వర్షపాతాన్ని కొలస్తారు.

కృతజ్ఞతలు

గత సంచికలో దక్షిణాఫ్రికా నేత క్రిస్ హానీపై వ్యాసం వ్రాసిన శ్రీ ఆర్. సుధా భాస్కర్‌కు, పురుగు మందులు, పాముకాటు విషాలపై వ్రాసిన శ్రీ ఎ. లెనిన్‌కు "రైతువాణి" కృతజ్ఞతలు తెలియజేస్తున్నది.

నాగస్వరం పాములకు వినిపిస్తుందా ?

ఎస్. వెంకట రావు

నాగస్వరం ఊదుతుంటే నాగుపాములు లయబద్ధంగా ఊగుతూ ఉండటం మనం చూస్తుంటాం. అయితే పాములు నిజానికి శబ్దం వినలేవని తెలుసుకుంటే మనకు ఆశ్చర్యం వేస్తుంది. అంతేకాదు పాములకు సరిగ్గా కళ్ళు కూడా కనిపించవు.

నాగు పాముల్లో గాని, మరి ఏ పాముల్లో గాని చెవి భాగం అభివృద్ధి చెందలేదు. శబ్దాలను వినే శ్రవణాంగం చెవి. దీనిలో మూడు భాగాలుంటాయి. బాహ్య చెవి, మధ్య చెవి, లోపలి చెవి. ఈ మూడు అభివృద్ధి చెందివున్న జంతువులు శబ్దాలను బాగా విన గలుగుతాయి. కాని పాముల్లో బాహ్య, మధ్య చెవులు లేవు. లోపలి చెవి మాత్రమే ఉంది. అందువల్ల అవి శబ్దాలను అసలు వినలేవు. మరి నాగస్వరం ఊదుతుంటే పాములు నాట్యం చేస్తాయెందుకని మీకు సందేహం రావచ్చు.

నిజానికి నాగస్వరం వినికాదు. నాగ స్వరం ఊదే వ్యక్తి దాని అటూ ఇటూ కదిపిస్తుండటం వల్ల అస్పష్టమైన ఆ దృశ్యాన్ని చూస్తూ పాము తల ఇటు అటు లయబద్ధంగా ఊపుతుంది. అయితే పాములకు గ్రహణ శక్తి లేదా అంటే ఉంది. పాము పొట్టను నేలమీద ఆనించి పయనిస్తుంటుంది. పొట్ట చర్మానికి సున్నితమైన కణాలుంటాయి. ఈ కణాలు భూమి మీద ఎంత చిన్న ప్రకంపనములైనను గ్రహించ గలుగుతాయి. మనం నడిచేటపుడు గాని, కర్రతో నేల మీద కొట్టినపుడు గాని, కలిగే ప్రకంపనలను పాములు గ్రహిస్తాయి. ఈ ప్రకంపనలు వచ్చే దిశకు వ్యతిరేక దిశలో పారిపోతాయి. అందువల్ల పొలాల్లో పని చేసే రైతులు చేలగట్ల మీద నడిచేటపుడు కర్రతో చప్పుడు చేస్తూ నడుస్తారు. దీనివల్ల పాముల నుండి రక్షణ పొందడానికి.

పాము కళ్ళు కూడా దృశ్యాన్ని స్పష్టంగా చూడలేవు. రంగు భేదాన్ని గుర్తించలేవు. పాము ఎదుట ఉన్న వస్తువును అస్పష్టంగా మాత్రమే చూడగలుగుతుంది. వాటి కదలికను అస్పష్టంగా మాత్రమే గ్రహించ గలుగుతుంది.

పాములు మనుషుల మీద పగపడతాయి, ప్రతీకారం తీర్చుకుంటాయి. చాలమంది నమ్ముతుంటారు. నిజానికి అవి వినలేవు, కనలేవు ఇంకా వాటికి మనుషుల మీద పగ పట్టే అవకాశమేముంది?

పాముల్లో అనేక జాతులు విషపు జంతువులే కనుక అవి అంటే మనిషికి భయం. అడవుల్లోనూ, పొలాల్లోనూ, తోటల్లోనూ సంచరించే రైతులకు ప్రజలకు పాముల వల్ల నిత్యం ప్రమాదం ఎదురవుతూ ఉంటుంది. ఒక లెక్క ప్రకారం ప్రపంచంలో ప్రతి ఏటా 30 నుండి 40 వేల మంది ప్రజలు పాముకాటువల్ల మరణిస్తున్నారు. కొన్ని రకాల పాముల విషం చాలా భయంకరమైనది. ఈ పాములు కరచిన కొద్ది క్షణాల్లోనే మనిషి మరణిస్తాడు. ఇంతటి విష జంతువులు కాబట్టి పాముల మీద మనిషికి అనేక భయాలు ఏర్పడ్డాయి. భయాల నుండి అనేక మూఢ నమ్మకాలు ఏర్పడ్డాయి. పాములు పగ పడతాయనే మూఢ నమ్మకం కూడా ఇందులో ఒకటి. అలాగే పాము కరిచిన వారిని బ్రతికించడానికి మంత్రాలు వేస్తారు. నిజంగా విషంగల పాము కరిస్తే మంత్రాల వల్ల విషం విరుగుడు కాదు.

ప్రపంచంలో 3 వేల జాతుల పాములున్నాయి. వాటిలో కేవలం 650 జాతులకు విషం వుంది. వీటిలో మరల ప్రాణాంతకమైన విష సర్పాలు చాలా తక్కువ. మనదేశంలో అయిదు జాతుల పాములకు మాత్రమే విషం వుంది. సముద్రంలో వుండే పాములన్నిటికీ విషం వుంటుంది. నాగుపాము, కట్లపాము వంటివి ప్రమాదకరమైనవి.

పాము తలలో విష గ్రంథులుంటాయి. ఈ గ్రంథుల సన్నని గొట్టాలద్వారా కోరలకు కలపబడి వుంటాయి. పాము కోరలు చర్మంలోకి దిగినపుడు దానివల్ల వచ్చే వత్తిడికి వి గ్రంథులలోని విషం కోరల ద్వారా మనిషి లేదా జంతువు చర్మంలోకి ప్రవేశించి రక్త ప్రసరణ ద్వార శరీరం అంతట నిమిషాల మీద ప్రాకుతుంది.

మనల్ని కరిచే పాములన్నీ విష సర్పాలయి వుండవు. ఏది విష సర్పమో కాదో స్పష్టంగా తెలియక పోవడం వల్ల అన్ని రకాల పాములకు మనం భయపడతాము. అలా కాకుండా పాము మనిషినిగాని, జంతువును గాని కరవడానికి కొద్ది నిమిషాల ముందు మరో జంతువును కరిచి వుంటే అప్పటికి గాని విష గ్రంథుల నుండి కావలసినంత విషం ఉత్పత్తి అయివుండదు. అలాఅయినపుడు విషసర్పం వల్ల అయినా ప్రాణాపాయం కలగదు. సాధారణంగా పాముల మంత్రగాళ్లు పైన చెప్పిన రెండు కారణాల వల్లనే మనుషులను నయం చేయగలుగుతారు. ఇది వారి మంత్రాల మహిమ వల్లగాక పాముల విషం సోకక పోవడం వల్ల జరుగుతుంది. ఇది తెలియక మనం మంత్రాలతో పాము కాటును నయం చేయవచ్చని భావిస్తుంటాం. శరీరంలోకి పాము విషం ఎక్కిన తర్వాత నయం కాదు. నయం చేయడానికి విషాన్ని విరుగుడు చేసే ఇంజక్షనులు తయారై ఉన్నాయి. అందువల్ల పాము కాటుకు గురైన వ్యక్తిని వెంటనే అస్పత్రికి తరలించి డాక్టర్ని సంప్రదించాలి కాని మంత్రాల వైపుకు పోరాదు.

కలకత్తాలో అంతర్జాతీయ సదస్సు

"వర్తమాన ప్రపంచంలో మార్క్సిజం ప్రాధాన్యత" అన్న అంశాలపై భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆద్వర్యంలో కలకత్తాలో 5 నుండి 7వ తేదీ వరకు అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సులో ప్రపంచ వ్యాపితంగా 21 కమ్యూనిస్టు పార్టీలు పాల్గొన్నాయి. మరొక 10 పార్టీలు సందేశాలను పంపాయి. అంతర్జాతీయంగా సోషలిస్టు ప్రపంచం తీవ్రమయిన ఎదురు దెబ్బలు తిన్న నేపథ్యంలో, ఎర్ర జెండాలనే మార్చుకొంటున్న పరిస్థితులలో మార్క్సిజం విశిష్టతపై మొట్టమొదటి సారిగా ఈ సెమినార్ జరగడం కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఒక మైలు రాయిగా నిలిచిపోతుంది. పెట్టుబడిదారీ సమాజమే మానవ సమాజంలో తుది వ్యవస్థ అని, సోషలిజానికి మనుగడ లేదని ప్రచారం జరుగుతున్న సమయంలో కారల్ మార్క్స్ 175వ జయంతి సందర్భంగా వామపక్షానికి కంచుకోటగా నిలిచిన పశ్చిమ బెంగాల్ లోని కలకత్తాలో జరిగిన ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. మార్క్సిజం లేదా శాస్త్రీయ సోషలిజం ఊహాజనితం కాదని, పిడివాదం అంతకన్నా కాదని, కార్యా చరణకు కరదీపికగా ఉండి, నిత్యం ఆచరణ ద్వారా దానిని పరీక్షిస్తూ ఉండాలి. అని సదస్సులో జ్యోతిబసు ఉద్ఘాటించారు. కమ్యూనిస్టు పార్టీల మద్య మరింత సహకారాన్ని, సమన్వయాన్ని, సంఘీభావాన్ని పెంపొందించేందుకు, సామ్రాజ్య వాద వ్యతిరేక శక్తులను పటిష్ట పరిచేందుకు ఈ సదస్సు దోహదపడింది. సదస్సులో మార్క్సిజం వర్థిల్లాలి అంటూ, సోషలిజానిదే అంతిమ విజయం అంటూ ప్రపంచ కమ్యూనిస్టు పార్టీలు నినదించాయి.



మార్క్సిజంపై కలకత్తాలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ప్రసంగిస్తున్న సి.పి.యం. ప్రధాన కార్యదర్శి శ్రీ హరికిషన్ సింగ్ సుర్జిత్

తెలంగాణా ప్రాంతం - కౌలుదారీ చట్టాలు

శ్రీ ఎ. అనంత రెడ్డి
అడ్వకేట్, రాష్ట్ర అధ్యక్షులు,
ఆల్ ఇండియా లాయర్స యూనియన్.

భూయజమాని కౌలును ఈ క్రింది పరిస్థితులలో రద్దు పరచవచ్చును.

ఎ i) కౌలుదారు వార్షిక కౌలును భూమిశిస్తు ఆఖరి వాయిదా చెల్లింపుకు గడువు ముగియడానికి ముందు 15 రోజులకు లోపుగా చెల్లించక పోయినట్లయితే -

ఎ ii) కౌలురేటు నిర్ధారణ కొరకు కలెక్టర్ లేదా ట్రిబ్యునల్ ముందు దరఖాస్తు ఉన్నపుడు కౌలుదారుకపైన పేర్కొన్న తేదీకి 15 రోజుల లోపుగా కౌలు రేటును చెల్లించక పోయినట్లయితే (అట్టి దరఖాస్తు లేనట్లయితే ఎంత వార్షిక కౌలును చెల్లించ వలసి వుంటుందో దానికి సమానమైన మొత్తాన్ని) -

ఎ iii) కలక్టర్ లేదా ట్రిబ్యునల్ నిర్ణయించిన కౌలురేటు అంతకు ముందు చెల్లించిన కౌలురేటు కంటే ఎక్కువ ఉన్నట్లయితే ఆ తేడా మొత్తాన్ని కలెక్టర్ లేదా ట్రిబ్యునల్ నిర్ణయం తర్వాత రెండు నెలల లోపు చెల్లించక పోయినట్లయితే -

బి) కౌలుదారు భూమికి హానికరమైన ఏపని చేసినా.

సి) భూమిని పునర్విభజన చేసినా

డి) తిరిగి కౌలుకివ్వడం లేదా స్వయంగా సాగు చేసుకోలేక పోవడం లేదా కౌలు హక్కును మరొకరికి దాఖలు పరచటం -

ఇ) వ్యవసాయ ప్రయోజనాల కొరకు భూమిని ఉయోగించడం.

ఈ సబ్ సెక్షన్ పేర్కొన్న కారణాల వలన భూ యజమాని కౌలు రద్దు చేయదల్చుకున్నట్లయితే కారణాలను వివరిస్తూ 6 నెలలు ముందుగా నోటీసు ఇవ్వవలసి వుంటుంది.

కౌలుదారు స్త్రీగాని, మైనర్ గని, శారీరకమైన లేదా మానసిక బలహీనతకు గురైనట్లయితే ఆ కౌలుదారు వేరొకరికి కౌలుకు ఇచ్చినట్లయితే అట్టి కౌలు రద్దు పరచరాదు.

3. ఈ చట్టంలోని సెక్షన్ 7 లేదా 8కి అనుగుణంగా సైన్యంలో పని చేస్తున్న వ్యక్తి తన భూమిని కౌలుకిచ్చినట్లయితే, తన సర్వీసు పూర్తి అయిన తర్వాత తాను సాగు చేసుకొనుటకు కౌలుదారుకు లిఖిత పూర్వకమైన నోటీసు ఇచ్చి, సంవత్సరం పూర్తియఅైన వెంటనే కౌలు రద్దు పరచవచ్చును.

కౌలుదారు భూస్వామికి చెందిన స్థలంలో నివాస గృహము నిర్మించుకున్నట్లయితే అట్టి కౌలుదారును ఆ ఇంటి నుండి భూస్వామి వెల్లగొట్టరాదు.

ఎ. అట్టి గృహం కౌలుదారు లేదా అతని పూర్వీకుల యొక్క ఖర్చుతో నిర్మించబడలేదని భూస్వామి ఋజువు చేసినా-

బి. ఆ ఇంటి స్థలమునకు చెల్లించవలసిన అద్దెను చెల్లించకపోయినా -

భూస్వామి కౌలుదారును అట్టి గృహం నుండి తొలగించవచ్చును.

ఈ చట్టంలోని సెక్షన్ 44(1) క్రింది భూయజమాని రక్షత కౌలును రద్దు చేసినపడు పై అంశాలు వర్తించవు.

కౌలుదారు కౌలుభూమిఓ మొక్కలనుగాని, చెట్లను గాని పెంచినట్లయితే వాటి యొక్క ఉత్పత్తిని కౌలుకాలంలో తానే పొందవచ్చును. కౌలు రద్దయిన తర్వాత లేదా తహసీల్దారు నిర్ణయంచిన ప్రకారం పరిహారాన్ని పొందవచ్చును. అయితే కౌలుదారు భూమిని అప్పగించటం ద్వారా కౌలును రద్దు చేసుకున్నట్లయితే అట్టి పరిహారానికి అనర్హుడు.

కౌలుకాలంలో కౌలుభూమిపై సహజ సిద్ధంగా పెరిగిన చెట్ల యొక్క ఉత్పాదనలో 2/3 వంతు కౌలుదారుకు, 1/3 వంతు భూ యజమానికి చెందుతుంది.

కౌలురాదు కౌలురేటును 3 సం॥లోపు కాలానికి చెల్లించక పోయినట్లయితే భూ యజమాని తహసీల్దారుకు ధరఖాస్తు చేసుకొనవచ్చును. అట్టి ధరఖాస్తుపై తహసీల్దారు విచారణ చేసిన తర్వాత అట్టి ధరఖాస్తు సరైందని భావించినట్లయితే కౌలురేటును చెలఇలంచవలసిందిగా ఆర్డర్ చేయవచ్చును. అయితే ప్రకృతి

(తరువాయి 23 పేజీలో)

ఉద్యమించిన రైతాంగం



కాపవరంలో పొగాకు రైతుల రాస్తారోకో దృశ్యం

నేడు వ్యవసాయ రంగం ప్రభుత్వ దివాళాకోరు విధానాలతో ఏడాది కేడాది సంక్షభం లోకి నెట్టబడు తున్నది. రైతు వ్యతిరేక న్యాయాలతో ప్రభుత్వం కసి తీర్చుకుంటుంటే రెండో వైపున ప్రకృతి రైతన్నపై కన్నెర్రో చేసింది. అసలే కరువు విలయ తాండవం చేస్తూ రైతులు అల్లాడి పోతుంటే, ప్రభుత్వం ప్రజల, అధికారుల విన్నపాలతో మేల్కొని కరువు అంచనాకు పూనుకుంది. రాష్ట్రంలో 17 జిల్లాలో 400 మండలాలకు పైగా కురువు వాతబడినప్పటికి, న్యాయదేవత కళ్లకు గంతలున్నట్లు 7 జిల్లాలలో 175 మండలాలను మాత్రమే ప్రకటించింది. తొలకరి జల్లులు పడుతున్న సమయంలో కరువు బృందం పర్యటించి, ఇపుడు అంచనా వేసి మరికొద్ది కాలానికి నిధులు మంజూరు చేస్తారట. ఎంత విడ్డూరం.

మరో వైపున రైతు పండించిన పంటను కూడా అమ్ముకోలేని స్థితిలో వున్నాడు. పొగాకు రైతాంగం ఎదుర్కొంటున్నది ఈ స్థితే. "గిట్టుబాటు ధర సంగతి దేవుడెరుగు, సరుకు అమ్మడైతే అదే పదివేలనే" రైతులు ఆశ పడుతున్నారు. ఈ ఏడాది పొగాకు రైతాంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు అనడంలో ఎట్టి సందేహం లేదు. గతంలో ఈ రైతులే "బోర్డు ముట్టడి" చేసిన చరిత్ర వుంది. వేలం కేంద్రాల బహిష్కరణలు సాధారణమై పోయాయి. ప్రభుత్వాల విధానాల ఫలితమే ఈ దుస్థితి.

ఈ రైతాంగం ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని పరిష్కరిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలపై ఎలాంటి చర్య తీసుకోనందుకు నిరసనగా 15వ తేదీన వేలం కేంద్రాలను బహిష్కరించి "రాస్తారోకో" చేపట్టింది. అఖిల పక్ష కార్యచరణ సమితి ఆద్వర్యంలో ఒంగోలు, వెల్లంపల్లి, ఉంగుటూరు, శింగరాయ కొండ, చీమకుర్తి, పొదిలి, మద్దిపాడు, నాగులుప్పల పాడులో ఉదయం 9 గం||ల నుండి 12 గం||ల వరకు రాస్తారోకో జరిగింది. ఫలితంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చీమకుర్తిలో శాసనసభ్యుడు జి.వి.శేషును ఘెరావ్ కూడా చేశారు. ఒంగోలులో జరిగిన రాస్తారోకో కార్యక్రమానికి వివిధ పార్టీల నాయకులు, అఖిల పక్ష నాయకులు పాల్గొన్నారు.

ఈ పిలుపును అందుకొని రాజమండ్రి, ఖమ్మం జిల్లా అశ్వారావు పేట, పశ్చిమ గోదావరి జిల్లా కాపవరంలో రాస్తారోకోలు నిర్వహించారు. కాపవరంలో ధర్మవరం, మలకపల్లి, చిట్యాల అన్నదేవరం గ్రామాల నుండి వందలాది మంది రైతుల పాల్గొని రాస్తారోకోని జయప్రదంగా నిర్వహించారు.

అయినప్పటికి ప్రభుత్వ స్పందన లేకపోవడంతో రైల్ రోకోకు అఖిల పక్ష కార్యాచరణ సమితి పిలుపు నిచ్చింది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల ఆందోళనను గమనించి వెంటనే రంగంలోకి దిగాలని కోర్తున్నాం. ●

కరువు బృందానికి రైతు సంఘం మెమోరాండం

రాష్ట్రంలో కరువు పరిస్థితినిన సమీక్షించడానికి, అంచనా వేయడానికి వచ్చిన కరువు బృందాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం హైదరాబాద్‌లో కలుసుకుని మెమోరాండాన్ని సమర్పించింది. రాష్ట్రం తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటోందని, పశుగ్రాసం లేక పశువులు కబేళాలకు తరలించే పరిస్థితి ఏర్పడిందని, మంచినీటికి తీవ్ర ఎద్దడి ఏర్పడిందని, ఫలితంగా కలుషితమైన నీటిని త్రాగడంవల్ల సోకిన అతిసార వ్యాధికి 500 మందికి పైగా చనిపోయారని, కరువు ప్రాంతాలలో వ్యవసాయ కూలీలకు పనులు కల్పించాలని కోరింది. రైతుల అప్పులను రీషెడ్యూల్ చేయాలని, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందజేయాలని, గండ్లు పడిన నీటి వనరులకు వెంటనే మమ్మత్తులు చేసి, చిన్న నీటి వనరులకు ప్రాధాన్యత ఇవ్వాలనే, డిమాండ్లతో మెమోరాండం సమర్పించింది. రైతు సంఘం అధ్యక్షులు శ్రీ బోడిపూడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు శ్రీ బి.యన్. రెడ్డి, కార్యదర్శి శ్రీ వి. శ్రీనివాస రావు, సహాయ కార్యదర్శి శ్రీ పి.మధులు కరువు బృందాన్ని కలిసిన వారిలో వున్నారు.

'ఉండి' కాల్వతో సతమతమవుతున్న రైతాంగం

పశ్చిమ గోదావరి జిల్లా ఉండి కాలువ పనులు ప్రపంచ బ్యాంకు నిధులతో చేపట్టినప్పటికీ రైతులకు ఏమాత్రం ప్రయోజనం లేకుండా పోయింది. ఈ కాలువ క్రింద 80 వేల ఎకరాలు సాగవుతుంది. కాలువ పనులు 1991 డిశంబర్ లో చేపట్టి 92 జూన్ లో ముగించి 23వ తేదీన నీరు విడుదల చేయగా నాలుగో రోజుల్లోనే 10 మీటర్ల లోతులో గండి పడింది. మరల వారం రోజులు నీరు నిలుపుదల చేసి గండిపూడ్చారు. పూడ్చిన రెండు రోజుల్లోనే మరోచోట గండి పడింది. కాల్వ గట్టు సన్నగా వుంటటం వల్ల కోతకు గురౌతూవున్నవి. గట్టును వెడల్పు చేసి, ఎత్తును పెంచినట్లయితే కాల్వకు పడిన గండ్లు రైతుల పాలిట శాపంలా తయారవుతాయి. వేలాది రూపాయలు వెచ్చించి పనులు చేపట్టిన్పటికి, శ్యాండ్ కాంబెడ్ ట్రీట్ మెంట్ స్టెంచి ఏర్పాటు చేయనందువల్ల తరచు గండ్లు పడుతున్నాయి. దీనిపై సరయిన చర్యలు తీసుకోవాలని భీమవరం డివిజన్ కార్యదర్శి శ్రీ టి. సూర్యనారాయణ మూర్తి అధికారులను డిమాండ్ చేశారు.



యండగండిలాకు దిగువన జారిపోయిన ఉండి కాల్వగట్టు

అసమాన ధైర్యసాహసాలతో టెర్రరిస్టుల నెదుర్కొన్న సంధూ కుటుంబానికి "శౌర్యచక్ర" ప్రదానం

పంజాబ్ లో వేలాదిమంది అమాయక ప్రజానీకాన్ని పొట్టన పెట్టుకున్న టెర్రరిస్టులను ధీరోదాత్తంగా ఎదుర్కొన్న ఒక కుటుంబ గాథ ఇది. అమృతసర్ జిల్లా బైకివింద్ గ్రామానికి చెందిన బల్వీందర్ సింగ్, ఆయన భార్య జగదీష్ సంధూ, సోదరుడు రంజిత్ సింగ్, మరదలు బలరాజ్ సంధూల వీరగాథ నేడు పంజాబులో మారు మ్రోగుతున్నది. "వీర సంధు"లని వీరికి పేరు పెట్టుకున్నారు. వీరి చరిత్ర వీడియోలకు, పత్రికలకు ఎక్కింది.

ఒకసారికాదు రెండుసార్లు కాదు పదహారు సార్లు ఖలిస్థానీ టెర్ర రిస్టులు ఈ గ్రామంపై దాడి చేశారు. ఈ కుటుంబం వారిని ప్రతిఘటించి గ్రామాన్ని ఐక్యం చేసి నిలబెట్టింది. 20 నుండి 30 మందితో కూడిన దళాలు ఎ.కె. 47 తుపాకులు, చేతి బాంబులు ఆఖరికి రాకెట్ లాంఛర్లతో సహా దాడులు సాగించాయి. అయినా లొంగిపోలేదు. వారి చేతిలో వున్నది 303 రైఫిళ్ళు మాత్రమే అయినా వారిలో వున్న దేశ భక్తి వారికి అండగా నిలిచింది. సంవత్సరంపాటు (1990 జనవరి నుండి డిశంబర్ వరకు) ఈ దాడులు ఆగకుండా సాగుతూనే వున్నాయి. ఆఖరి దాడిలో కూడా టెర్రరిస్టులు విఫలమై వెనుతిరిగి పోయారు.

బల్వీందర్ సింగ్ కుటుంబానికి ఈ స్ఫూర్తి ఎక్కడి నుండి వచ్చింది? సిపిఐ(యం) పార్టీ ఇచ్చిన స్ఫూర్తే దీనికి కారణమంటున్నారు వారు. పార్టీ లైను అమలు జరపడంలో ఆ కుటుంబం అసమాన త్యాగాలకు సిద్ధపడింది. బల్వీందర్ సింగ్ డి.వై.యఫ్.ఐ. రాష్ట్రకమిటి సభ్యుడు. ఆయన భార్య కూడా ఇదే సంఘంలో కార్యకర్త. తమ్ముడు సి.ఐ.టి.యు రవాణా సంఘంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు.

ఈ వీర కుటుంబానికి ఏప్రిల్ 13న రాష్ట్రపతి శ్రీ శంకర దయాళ్ శర్మ "శౌర్యచక్ర" అవార్డును బహూకరించారు. ఆకుటుంబానికి 'మన రైతువాణి' జేజేలు పలుకుతున్నది.

కోళ్ళ పెంపకము-మెళకువలు

మన దేశంలో కుటీర పరిశ్రమగా మొదలైన కోళ్ళ ంపకం గత రెండు మూడు దశాబ్దాలుగా అనూహ్యమైన భివృద్ధి చెంది మన దేశంలో ఈనాడు మొదటి 20 పెద్ద రిశ్రమలలో ఒకపరిశ్రమగా పరిగణించబడుతున్న ఈ అభివృద్ధిలో ున రాష్ట్రం ముఖ్యమైన పాత్ర వహించింది. కోళ్ళ సంఖ్యలోను డ్ల ఉత్పత్తిలోను దేశంలోని ప్రథమ స్థానంలో నిలిచి ఉన్నది ున రాష్ట్రమే.

కోళ్ళ పెంపకంలో ఉత్సాహం ఉండి పెట్టుబడి పెట్టగానే రిపోదు. దీనికి సంబంధించిన అన్ని ఆధునిక శాస్త్రీయ పద్ధతులను లుసుకోవలసి ఉంటుంది. అలాంటప్పుడే లాభములు గడించి ురింత అభివృద్ధి అయ్యే అవకాశం ఉంటుంది. దేశంలో 1990 ాటికి సంకరజాతి గ్రుడ్ల కోళ్ళు 10.5 కోట్లు ఉండగా రాష్ట్రంలో .90 కోట్లు ఉన్నాయి. గ్రుడ్ల ఉత్పత్తిలో చూసినట్లయితే ేశంలో 23580 కోట్లు ఉండగా మన రాష్ట్రంలో 4.53 కోట్లు ుంది.

గ్రుడ్ల కోళ్ళ జాతులు, వాటి బ్రీడింగ్ పద్ధతులు

దేశవాళీ కోడిగ్రుడ్ల ఉత్పత్తిలో చాలా వెనకబడి ఉంది. దేశీ జాతుల ముందు చాలా క్రింది స్థాయిలో ఉన్నది. ందువల్ల గ్రుడ్ల దిగుబడి పెంచేందుకు విదేశీ జాతులు మరియు ంకర జాతులు మన దేశంలోకి దిగుమతి చేయబడినవి. వాటిలో ట్ లెగ్ హార్న్ రోడ్ ఐలెండ్ రెడ్ ముఖ్యమైనవి. తెల్లని ుడ్లు ఎక్కువ సంఖ్యలో పెడుతుంది. కాబట్టి వైట్ లెగ్ హార్న్ ోళ్ళ ఫారాల్లో సర్వసాధారణంగా ఉపయోగించబడుతుంది.

మార్కెట్ లో హేచరీ వారి పంపిణీ చేస్తున్న కోడి ల్లలు, ఇంబ్రెడ్ హైబ్రెడ్ పద్ధతిలో రూపొందించబడినవి. ఈ ంకర జాతి కోళ్ళు మంచి యాజమాన్యంలో సంవత్సరానికి 60 నుండి 280 గ్రుడ్ల వరకు ఇస్తూ స్వచ్ఛమైన జాతుల కన్నా ాదాపు ప్రతీ కోడి పెట్టకు 100 గ్రుడ్లు ఎక్కువ వచ్చును. ణనీయమైన గ్రుడ్ల ఉత్పత్తి పెరుగుదలకు ఈ సంకరజాతి

రకాలే ప్రధాన కారణం. కాబట్టి రైతు సోదరులు మన రాష్ట్రంలో ఉన్న హేచరీలలో వాటి శ్రేష్టతను బట్టి అనుభవమున్న రైతుల సలహాలనుబట్టి మంచి రకాన్ని ఎంపిక చేసుకోవలసి ఉంటుంది.

రాష్ట్రంలో హైదరాబాదులో ఉన్న వెంకటేశ్వరా హేచరీస్‌లో బాబ్ కాక్ - బివి - 300 అనే కోడి అనే సంకర జాతి రకం లభ్యమవుతున్నది. అంతేకాకుండా బి.ఎల్.వి. హేచరీస్‌లో లోమాన్ అనే రకం ఫార్మర్స్ హేచరీస్‌లో దికాల్ట్ అనే రకం సింక్ పౌల్ట్రీలో షేవర్ అనే రకం సి.వి.ఆర్. హేచరీస్‌లో హైలైన్, ఎస్.ఎస్.ఎ. హేచరీస్‌లో కీస్టోన్ అనే రకం హైదరాబాద్ లో లభ్యమవుతున్నాయి.

కోళ్ళ షెడ్లు వాటి నిర్మాణం

కోళ్ళ షెడ్డు అన్ని రకాలుగా సౌకర్యముగా ఉండి కోళ్ళకు తగిన గాలి వెలుతురు సమకూర్చుతూ మంచి రక్షణ కలిగిస్తూ అధికోత్పత్తికి దోహదకారిగా ఉండాలి. షెడ్డు నిర్మాణానికి ఎంచుకున్న స్థలం నీటి వసతి విద్యుత్ సరఫరా మార్కెట్ వంటి సౌకర్యాలకు అనువుగా ఉండాలి. షెడ్డు ఎత్తులో ఉంటే గాలి చలనం బాగా ఉంటుంది. మురుగు నీరు నిల్వ ఉండకూడదు. కాబట్టి కోళ్ళను పెంచే రైతు సోదరులు పై సూచనను గమనించి తగిన పదేశములను ఎన్నుకోవలసి ఉంటుంది.

(సశేషం)

ముప్పారం గ్రామ కథ

పి. మధు

గత సంచిక తరువాయి..

చనిపోయిన వారిపేరుతో అప్పులు కైంకర్యం

"కో-ఆపరేటివ్ సొసైటీలో 20 మంది రైతుల పేర పోర్జరీలు చేసి అప్పులు మంజూరు చేయించి మందుల (ఎరువుల) సంచులు కొని వాటిని అమ్ముకొని కాజేసాడు ఈ సర్పంచ్." ఈ 20 మందికి పంట రుణాలు చెల్లించమని అధికారుల నుండి నోటీసులు రావడంతో గుట్టు రట్టయింది. అందులో చనిపోయిన బట్టు వరదరాజు, కమ్మరి నాగయ్య గార్లపేర్ల మీద వారి సంతకాలతో అప్పులు పొందినట్లు రికార్డయి ఉండడం రైతాంగంలో ఆగ్రహానికి కారణమయింది. రైతులందరు కలిసి కలెక్టరుకు మొరపెట్టుకున్నారు. కోర్టులో కేసు నమోదు అయింది. బెయిలు తెచ్చుకొని గ్రామంలో డబ్బు చెల్లించి కాంప్రమైజ్ అయ్యారు.

మధ్యాహ్న భోజన పథకం

మధ్యాహ్న భోజన పథకం కింద బడిపిల్లలకు భోజన సదుపాయం కల్పించాలని వచ్చిన పథకాన్ని తుంగలో తొక్కి సర్పంచ్ కాజేయనారంభించాడు. గ్రామంలోని కొంత మంది యువకులు నాటి ముఖ్యమంత్రి రామారావుకు నేరుగా ఉత్తరాలు రాసారు. దానిపై కలెక్టరు విచారణ ప్రారంభమయ్యింది. కేసు నమోదు అయ్యింది. కానీ అనంతరం కేసు మాఫీ చేయబడింది.

రేషను బియ్యం

పోలీస్ పటేల్ (కరణం) డీలరుగా ఉన్నంత కాలం బియ్యం కొంత వరకు అందాయి. సర్పంచ్ అడిగినంత బియ్యం ఖాతాల క్రింద యివ్వవల్సిరావడంతో డీలరు అప్పులపాలయి డీలరుషిప్పు మానేశాడు. ప్రస్తుతం సర్పంచ్ పేరుతోనే డీలర్‌షిప్ ఉన్నా బియ్యం తేవడం లేదు.

కల్లు దుకాణం

గ్రామాలలో కల్లు అమ్మే దుకాణందారు సర్పంచ్‌కి సంవత్సరానికి 10 వేలు చెల్లించితే గాని అమ్ముకోవడ సాధ్యమయ్యేదికాదు.

కల్లుదుకాణం వాటాదారుగా నడిమధ్యలో టీచర ఆగయ్య గౌడ్ చేరాడు. డబ్బు వృధాగా సర్పంచ్ తినేస్తున్నా డన్న భావంతో ఈ డబ్బు శిథిలావస్థలో నున్న గుడులన (దేవాలయాలను) బాగు చేయడానికి వినియోగించాలన ప్రతిపాదన చేసి రెండేళ్ళలో రెండు గుడులు బాగుచేయించాడు. ఆగయ్యగౌడ్ జమా ఖర్చులు జనానికి వివరించాడు. దీనిత ఇతని పలుకుబడి పెరుగుతోందని, అలాగే తన ఆదాయాని గండి పడిందని భావించిన సర్పంచ్ ఆగమయ్య గౌడ్ టీచరుక ట్రాన్స్‌ఫర్ చేయించాడు. ప్రస్తుతం కల్లు డబ్బు 10 వేల సర్పంచ్ అనుభవిస్తున్నాడు.

మంగలి విఠల్ ప్రతిఘటన

మంగలి విఠల్ ఇంటి స్థలంలో కొంత భాగం సర్పం ప్రోత్సాహంతో పక్కింటి కోమటి నర్సింహ ఆక్రమించాడు దీనిపై మంగలి విఠల్ కోర్టుకెక్కి స్టే తెచ్చాడు. చివరక తీర్పు విఠల్‌కు అనుకూలంగా వచ్చింది. కోమటి నర్సిం కోర్టు కేసు వల్ల ఖర్చులు, అలాగే ఆస్థలంలో పునాదు కట్టటంతో డబ్బు ఖర్చు అయ్యి నష్టపోయాడు. అందుక ప్రతిగా మరోచోట భూమి చూపించినా కట్టుకోవడాని డబ్బులేక నీరస పడ్డాడు.

మంగలి విఠల్ కోర్టుకు ఎక్కాడు కాబట్టి మాలీపటేల్ (భూస్వామిని) రెచ్చగొట్టి, తన భూమి అంచున ఉన్న విఠ భూమిని కొంత భాగం దున్నించాడు. "నేను పేదవాడిని, మీ మస్తు భూమి వుంది. ఈ గైరాను (బంజరు) భూమి జో రావద్దని" ఎంత ప్రాధేయపడినా లాభం లేకపోవటంతో కోర్టు వెళ్లాడు. కోర్టులో కూడా మంగలి విఠల్ గెలవడం మాలీపటే వేయి రూపాయలు నష్టపరిహారం చెల్లించాల్సి వచ్చింది. రెండు కేసుల్లో మంగలి విఠల్ పట్టుబట్టి గెలవడంతో ప్రజ పెద్ద సంచలనం కలిగింది.

సర్పంచ్‌గా విఠల్ నామినేషన్

ఈ గొడవలు ఇలా జరుగుతున్న తరుణంలోనే సర్పంచ్ ఎన్నికలు వచ్చాయి. జనమంతా ప్రోగయ్యి మంగలి విఠల్‌ను నామినేషన్ వేయమని ప్రోద్బలం చేశారు. ఈ ప్రోత్సాహంతో విఠల్ నామినేషన్ వేయడానికి సిద్ధం అయ్యాడు. ప్రక్క గ్రామం ముస్తాపూర్‌లో నామినేషన్ వేయాలి. యువకులు ఎవరిదారిన వారు 20 మంది ముస్తాపూర్ చేరారు. విఠల్-విఠల్‌తో పాటు మరో ఇద్దరు బస్సులో ముస్తాపూర్ వచ్చారు. నామినేషన్ పత్రాలపై సంతకం చేసి ప్రతిపాదకుడుగా రాదలచుకొన్న ముదిరాజ్ భూమయ్యను తల్లిదండ్రులు ఇంట్లో వేసి తాళం వేసారు. అందువల్ల రాలేకపోయాడు.

విఠల్ అతి కష్టం మీద సంపాదించిన నామినేషన్ పత్రాలతో ముస్తాపూర్ చేరుకోగానే అక్కడకు చేరిన యువకులు అమితోత్సాహంతో ఇక సర్పంచ్ రోజులు దగ్గర పడ్డాయని ఆనందంతో విఠల్‌ను చుట్టుముట్టారు. మనమందరం ఇక్కడ గుమిగూడుతున్న విషయం సర్పంచ్‌కు తెలుస్తుంది. ఇప్పుడే తెలియటం మంచిది కాదని విఠల్‌తో వచ్చిన ఇద్దరు ప్రతిపాదకులు యువకులకు వివరించి, ప్రక్కకు పంపించి చాయ్ హోటల్‌లోకి వెళ్లారు. "టీ" త్రాగి నామినేషన్ వేయడానికి ఆఫీస్ లోకి ప్రవేశించారు. తీరా నామినేషన్ వేయ చూస్తే నామినేషన్ పత్రాలు కనిపించలేదు. హడావుడిగా ఆందోళనతో బయటికి వచ్చి పత్రాలు వెతకటం ప్రారంభించిన ఆ ఇద్దరు కొంత సమయానికి కానరాకుండా పోయారు. విఠల్‌ను బెదిరించి లొంగదీసుకోలేకపోయిన నరేందర్ రావు, విఠల్ అనుయాయుల్ని లొంగదీసుకొని నమ్మించి మోసం చేశాడని, విఠల్ గమనించి దిగాలుపడ్డాడు. ఇది పచ్చి మోసం అని ప్రజలు తిట్టిపోసుకున్నారు. ఈ విధంగా ఏకగ్రీవ ఎన్నికలో నరేందర్ రావు సర్పంచ్ అయ్యాడు.

ఈ రీతిగా గ్రామంలో భూములపై పెత్తనం అంతా నరేందర్ రావుదే. ఆయన ఎవరిని దున్నుకోమంటే వారే దున్నుకోవాలి. లేకపోతే మరొకరిని ఉసిగొల్పి పేచీలు, తగాదాలు పెట్టడం ఆనవాయితీగా సాగుతూ వస్తూంది. అందువల్ల మన భూముల మీద ఏమి పేచీలు పెడతాడోనన్న భయంతో ఎవరికి వారు భూస్వామి నరేందర్ రావుకు అణిగిమణిగి ఉంటున్నారు.

భూస్వాములకు ఏ నీతి, నిజాయితీ లేదని, చివరకు దేవుడిపై భక్తి సైతం నాటకమేనని డబ్బుకు కక్కుర్తి అయిన కరుస్తారని భూస్వామికి కులం, రంగు, భక్తి, అన్నవి ఏమీ లేవని కేవలం తన పెత్తనం, దోపిడీ, అధికారం ప్రధానమని భావించిన కొందరు యువకులు గ్రామంలో నేడు గళమెత్తారు. మంచిరోజులు వచ్చాయి.✱

సవరణ : గత సంచిక 25వ పేజీలో బాణామతి ప్రయోగం సబ్ హెడ్డింగ్ 7వ లైనులో హరిజన బాలయ్య బదులుగా హరిజన నాగయ్య అని చదువుకోగలరు.

With best compliments from :

Phone No. 232664

THE HYDERABAD AGRICULTURAL CO-OPERATIVE ASSOCIATION LIMITED

HACA BHAVAN, OPPOSITE PUBLIC GARDENS, HYDERABAD - 500 004.

(Regd. No. 20005)

- *A premier Co-operative Apex institution to serve Agriculture community.*
- *Dealing in Fertilisers, Pesticides, Seeds and Agricultural implements.*
- *It also undertakes marketing of food grains.*
- *Our Branches in all the Districts of Telangana serve the Rural folk at their door step through PACS.*
- *The Janatha Sarees and dhoties and other Textles goods are suppleid through PACS.*
- *We take care of needs of students supplying Text Books and NOte Books fairly at reasonable prices.*
- *Please visit our counters at our office premises, opposite Public Gardens, for your daily requirement of food grain etc., and Textiles.*

SRI K. RAMAKRISHNA REDDY, BA, LLB, HDC
Chairman

SRI D. CHANDRASEKHAR REDDY, MA, HDC,
Jt. Registrar Managing Director

(17వ పేజీ తరువాయి)

వైపరీత్యాల వలన పంటలు సరిగా పండకపోవడం వలన కౌలు రేటును కౌలుదారు చెల్లించలేక పోయినట్లుగా తహసీల్దారు భావించినట్లయితే అట్టి కారణాలను వివరిస్తూ ఆర్డరు చేసిన తర్వాత సంవత్సరం లోపు బకాయి పడ్డ కౌలురేటును చెల్లించవలసిందిగా ఆర్డరు చేయవచ్చును. ఆ సంవత్సరం లోపుకూడా చెల్లించక పోయినట్లయితే కౌలు రద్దు చేయబడి కౌలుదారు భూమి నుండి తొలగించ బడతాడు.

కోర్టు డిక్రీలను అమలు పర్చుటకు జప్తుచేయడం గాని, అమ్మటంగాని చేయరాదు. సెక్షన్ 28 లేదా 32లలో పేర్కొన్న పద్ధతిలో కాక ఇతర పద్ధతిలో కౌలుదారును కౌలుభూమి నుండి తొలగించి నట్లయితే అట్టి కౌలుదారు తహసీల్దారుకు ధరఖాస్తు చేసుకొని భూయజమాని నుండి గాని లేదా భూ యజమాని క్రింద వున్న ఏ ఇతర వ్యక్తి వద్ద నుండి గాని భూమిని తిరిగి స్వాధీనం చేసుకొనవచ్చును.

సవరణ : గత సంచికలో 17వ పేజీలో రెండవ కాలమ్‌లో రెండవ వాక్యాన్ని క్రింది విధంగా చదువుకోగలరు. "కరువు లేదా ఇతర ప్రకృతి వైపరీత్యాలవల్ల భూ యజమానికి శిస్తు చెల్లింపులో ఏదైనా రాయితీ కల్పించబడినట్లైతే అట్టి రాయితీ కౌలుదారుకు కౌలు చెల్లించడంలో కూడా వర్తిస్తుంది."

(రక్షిత కౌలుదార్ల గురించి వచ్చే సంచికలో...)

నోట్ చేసుకోండి

- పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం 1992 జూన్ 30 నాటికి 9,36,506 ఎకరాల భూమిని 20,43,700 మంది రైతులకు పంచింది. వీరిలో 56.37% మంది షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందినవారు.
- 10 ఎకరాలు అంతకన్నా ఎక్కువ భూమిఉన్న కమతాల శాతం దేశం మొత్తం మీద 47.99% ఉంటే, బెంగాల్‌లో 13.77% మాత్రమే ఉన్నది.
- 1992 వరకు బెంగాల్‌లో 14,39,000 మంది కౌలుదారులు ప్రభుత్వ రికార్డులలో నమోదు చేయబడ్డారు.
- పశ్చిమ బెంగాల్ 75% సాగు భూమి చిన్న, సన్నకారు రైతుల చేతులలో ఉన్నది.
- కూరగాయల ఉత్పత్తిలో మన దేశం 48.5 మిలియన్ టన్నులతో 2వ స్థానంలో ఉండగా, చైనా 113 మిలియన్ టన్నులతో ప్రథమ స్థానంలో నిలిచింది.

With best compliments from :

Phones : STD -08924
(O) 45127
(R) 45035
Chodavaram (O) 45038

THE CHODAVARAM
CO-OP. SUGARS LIMITED

Regd. Office & Factory :
NO. B-1109, CHODAVARAM MANDALAM, GOVADA - 531023, VIZAG DIST.

Manufacturers of :
BEST QUALITY WHITE CRYSTAL SUGAR
for
DOMESTIC CONSUMPTION & EXPORT

Sri K. B. VENKATA RAO
MANAGING DIRECTOR

Sri K. PRADEEP CHANDRA
DIST. COLLECTOR/CHAIRMAN

పశ్చిమ గోదావరి జిల్లాలో రైతు ఉద్యమం

ఆర్. సత్యనారాయణ రాజు

స్వాతంత్ర్యానికి పూర్వకాలంలోను, 1950లలోను జిల్లాలో జమీందారీ భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా చేసిన పోరాట సాంప్రదాయాలను అనుసరించి రైతు సంఘ కార్యక్రమాలు కొనసాగిస్తున్నాము. స్వాతంత్ర్యానంతర కాలంలో కొంత కాలం బలహీనంగా ఉన్నప్పటికీ కార్యక్రమాలు చేస్తూ వచ్చాము.

గత 5 సంవత్సరాలుగాజిల్లాలో రైతు సంఘం బలపడుతున్నది. జిల్లా మొత్తంలో రైతాంగాన్ని సంఖ్యరీత్యా అందరినీ సమీకరించే శక్తి లేకపోయినా కార్యకలాపాల రీత్యా, పలుకుబడి రీత్యా మన సంఘం పెద్ద సంఘంగా ఉన్నది. రెగ్యులర్ గా రైతాంగం యొక్క సమస్యలను తీసుకుని పనిచేస్తూ జిల్లాలో గుర్తింపు పొందాము. నిరంతరం పలుకుబడి పెరుగుతున్నది.

ఈ కాలంలో డెల్టా ప్రాంతంలో ప్రధానంగా డ్రైనేజి సమస్య, పంటనీరు సక్రమంగా పరఫరా చేసేటందుకు, క్రాప్ ఇన్స్యూరెన్స్ సక్రమంగా అందేటందుకు తమ్మిలేరుపై తుమ్మూర్ర వద్ద ప్రాజెక్టుకు, తమ్మిలేరు, ఎర్రకాల్వ, కొవ్వాడ కాల్వలపై ప్రాజెక్టుకు ఆందోళన చేశాము. కానూరు పెండ్యాల పంపింగ్ స్కీమ్ అమలు జరపాలని కోరి, ఐ.ఎల్.టి.డి. కంపెనీ వ్యతిరేక ప్రచారాన్ని త్రిప్పి కొట్టి ఆందోళన చేశాము. తరువాత కాలంలో ఈ స్కీమ్ అమలు జరిగింది. కొల్లేరులో భూస్వాముల దోపిడీని అంతం చేయాలని కొల్లేరు బంజరుకు పట్టాలు ఇవ్వాలని, కొల్లేరును పర్మనెంటు జోన్ లో చేర్చాలనీ రైతు సంఘం ఈ కాలంలో ఆందోళన జరిపింది.

ఈ కాలంలో వ్యవసాయ కార్మికులు, పేద రైతులచే బంజరు భూములు ఆక్రమింప చేయటం, నీటి వనరుల అభివృద్ధికి కృషి చేయటం, బ్లాక్ మార్కెట్ ను అరికట్టి ఎరువులు, బండి పట్టాలు, పలుగులు, పారలు కంట్రోలు ధరలకు రైతులకు అందివటం వంటి కార్యక్రమాలు చేయటం జరిగింది.

పోలవరం ప్రాజెక్టు కోసం, చింతలపూడి తాలూకా కళ్యాణ రాయుడు చెరువు మరమ్మత్తు ఇతర స్థానిక సమస్యలపైన కృషి చేశాము. డ్రైనేజీ సమస్యపై సదస్సులు నిర్వహించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చాము. 1992-93లో చేపట్టే వశిష్ఠ బేసిన్ లో డ్రైనేజీ పనులకు సంబంధించి రైతు సంఘం, అచంట శాసన సభ్యుని (సి.పి.ఎం.) చొరవతో ఆచంటలో సదస్సు నిర్వహించాము. మనం నిర్వహించిన సదస్సులకు డిపార్ట్మెంట్ ఉన్నతాధికారులు హాజరవటం మన సంఘం పలుకుబడికి తార్కాణం. మెట్ట ప్రాంతంలో వ్యసాయం సాగుకి ప్రధాన ధారమైన విద్యుచ్ఛక్తి సమస్యపై పనిచేస్తున్నాము. విద్యుచ్ఛక్తి ధరల పెంపుకి నిరసనగా ఆందోళన చేశాము. స్థానికంగా ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోవటం, నూతనంగా మోటార్ కనెక్షన్లు ఇప్పించటం వంటి సమస్యలపై పనిచేస్తున్నాము.

ఎరువుల సమస్యపై

గత సంవత్సరం కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎరువులపై ఇస్తున్న సబ్సిడీని రద్దుచేసి ఒక్కసారిగా ఎరువుల ధరలు 40 శాతం పెంచి వేశారు. ధరలు పెంచిన తరుణంలోనే రైతులకు ఎరువులు ఉపయోగించే కాలం అయింది. దీనిని ఆసరాగా తీసుకుని ఎరువుల వ్యాపారులు పాత రేట్లలో వచ్చిన ఎరువులను దాచి వేసి అధికరేట్లకు అమ్మటానికి ప్రయత్నించారు. వెంటనే రైతు సంఘం చొరవ తీసుకుని జిల్లాలో 25 కేంద్రాలలో సుమారు 1 లక్ష బస్తాల ఎరువులను పాతరేట్లకే అమ్మించడం జరిగింది. మన సంఘం కృషికి వ్యవసాయాధికారులు కూడా సహకరించారు. ఎరువుల ధరలు తగ్గించాలని ఆందోళన చేయాలని రాష్ట్ర రైతు సంఘం ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలో 20 కేంద్రాలలో రాస్తారోకో చేశాము. ఎరువుల సమస్యపై చేసిన కృషి జిల్లాలోని రైతాంగంలో మన సంఘానికి మంచి గుర్తింపును తెచ్చింది.

జిల్లాలో కొన్ని చోట్ల నకిలీ ఎరువులు అమ్ముతుండగా వాటిని పట్టుకొని అధికారులకు అప్పగించాము. నకిలీ ఎరువుల సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చి అరికట్టాము.

ఇవేకాక రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపైన ఎప్పటికప్పుడు అధికారుల వద్దకు రాయబారాలు జరిపి సమస్యలను చర్చించటం, అవకాశం మేరకు పరిష్కరించటం జరుగుతున్నది.

Printed & Published by Vankayalapati Srinivasa Rao on behalf of A. P. Rythu Sangham, at Graphics Den, Himayathnagar, Hyderabad 29 (A. P.) Editor : V. Srinivasa Rao.

మనం - మన ఆరోగ్యం

సమధాతువైన ఆహారాలంటే ఏమిటి ?

మన ఆహారంలో ఉన్న ప్రధాన పోషక పదార్థాలు అయిదు రకాలు. పిండి పదార్థాలు, మాంసకృత్తులు, క్రొవ్వులు, విటమినులు, ఖనిజాలు. వీటిని గురించి మనము క్రిందటి అధ్యాయములో చదువుకున్నాము. అవి ఏఏ పదార్థాలో లభిస్తాయో గ్రహించాము. అవి మన దేహానికి ఎందుకు అవసరమో కొంత తెలుసు కున్నాము. తరువాత ఈ రకరకాల పోషక పదార్థాలను తగు పరిమాణములో ఎలా సేకరించాలో మనము కొంత తెలుసుకోవలసి ఉన్నది. ఎందుకంటే అవి తక్కువయితే మన ఆరోగ్యము సరిగా ఉండదు. ఎక్కువయితే మన దేహారోగ్యనికి అంత మంచిది కాదు.

వయసును బట్టి ఆహార పరిమాణము మారుతూ ఉంటుందనేది అందరికీ తెలిసినదే. ఒక చిన్న పిల్లవాడు, స్కూలుకి వెళ్ళే పిల్లవాడి కంటే తక్కువగా తింటాడు. స్కూలుకు వెళ్ళే పిల్లవాడు పెద్దవాళ్ళ కంటే తక్కువగా తింటాడు. కాయ కష్టం చేసే పెద్దవాడికి మెదడుతో పనిచేసే వాడికంటే అధికంగా ఆహారం అవసరం. అధికాహార మంటే పరిమాణములో కాదు - పిండిపర్థాలు, మాంసకృత్తులు, క్రొవ్వు లేక నూనెలు గల పుష్టి కరమైన ఆహారమన్నమాట. ప్రతి పోషక పదార్థము యొక్క అవసరము ఎంతెంత ఉన్నదో ముందుగానే స్పష్టముగా చెప్పటము జరిగింది. ఉదాహరణకు గర్భిణీ స్త్రీలకి కాల్షియం అనగా ఖనిజ పదార్థము అధికంగా కావలసి ఉన్నప్పుడు అది ఎక్కువగా లభించే ఆహార పదార్థాలే అవసరం కాని ఏదో ఒకటి ఎక్కువగా తినటం కాదని మనం గ్రహించాలి.

మనకు ప్రతి పోషక పదార్థము ఎంతెంత కావాలి? మన దేశములో వైద్యులూ, శాస్త్రజ్ఞులూ ప్రతిరోజు ఏ వయసు వారికి ఎంత ప్రమాణంలో ప్రతి ఒక్క పోషక పదార్థము అవసరమో తేల్చుకోవటానికి నిశితంగా ప్రయోగాలే చేశారు. మాంసకృత్తులు మరింతగా, ముఖ్యమైన కొన్ని విటమినులు, ఖనిజ పదార్థాలు కాలొరీల ప్రమాణంలో ప్రతి నిత్యమూ తీసుకొనవలసిన ప్రమాణాలూ లేక మోతాదులూ వారు నిర్ణయించి సాధారణంగా స్త్రీ కంటె పురుషుడు భారీగా ఉంటాడు. గనుక అతనికి స్త్రీ కంటె అధికంగా కాలోరీలు మాంసకృత్తులు మోతాదు తగినంతగా పెరుగుతుంది. అలాగే కాల్షియం (ఖనిజ పదార్థము) ఇనుము, విటమినులు కూడా ఆమెకు అవసరము. కనుక స్త్రీకి అధికాహారము, ప్రత్యేకాహారం కూడా ఇటువంటి పరిస్థితులలో ముఖ్యము.

పిల్లలు తక్కువగా తింటారు. వాళ్ళకు కొలోరీలు మాంసకృత్తుల అవసరము కూడా తక్కువే. చిన్నవాళ్ళే అయినా కాల్షియం, ఇనుము ప్రత్యేకంగా కావాలి. కాల్షియం పళ్లకు, ఎముకల పెరుగుదలకు అవసరము. ఇనుము రక్త వృద్ధికి అవసరము. పిల్లలకు కావలసిన విటమినులు పరిమితమైన మోతాదే. అయినా మంచి కనుదృష్టికి అది చాలా ముఖ్యము.

క్రొవ్వు లేక నూనెల వంటి ప్రధానమైన పోషకాహారాన్ని వచ్చే పట్టికలో ఇవ్వగలము. క్రొవ్వు పదార్ధాలనుంచి 15 శాత కాలోరీలు కావాలని ఒక సామాన్యమైన అంచనావేసి సిఫారసు చేశారు. దీనివల్ల 35-40 గ్రాముల క్రొవ్వు ప్రతిరోజు పెద్దవాడికి అవసరమని తేలుతున్నది. రక్తనాళాలలోని గోడల వంటి భాగాలలోపల క్రొవ్వు పదార్థాలు పేరుకొని పోయి, రక్తప్రవాహ వేగాన్ని తగ్గింప చేస్తాయి. ఈ కారణాల వల్ల అనేక రకాలుగా పలచటి నూనెలను (కుసుమ, ప్రొద్దుతిరుగుడు పువ్వు, నువ్వులు, ప్రత్తి, వేరుశనగ) పరిశుద్ధము చేయగా వచ్చిన ఆమ్లముతో కలిసిన క్రొవ్వు మొత్తము కాలొరీలలో 15 శాతం ఉండాలని అన్నారు.

పై మోతాదులలో ప్రతి రోజు ఆహారము ఉండాలని చెప్పటంలో అర్థమేమంటే మనిషి ఆరోగ్యవంతముగా ఉండటానికి, సరియైన పెరుగుదల ఉండటానికి, మనకు సరిఅయిన పరిమాణంలో పోషక పదార్థాలు లభించటానికి సక్రమమయిన పరిమాణంలో కొన్ని రకాల ఆహార పదార్థాలు తినాలి. తరువాత మనకు కావలసిన పోషక పదార్థాలు వేటిలో లభిస్తాయో వాటినే, ప్రతి రోజు తినవలసిన వాటినీ గురించి తర్వాత తెలుసుకుందాము.

ఆధునిక పరికరాల పరిచయం-3

8. ఎ.పి.ఎ.యు. ప్లాంటర్ :

విత్తనములు, మరియు ఎరువులు ఒకేసారి వేయడానికి ఉపయోగపడుతుంది. ఒక జత ఎద్దులు సరిపోతాయి. రోజుకు రెండున్నర ఎకరముల నుండి 3 ఎకరముల వరకు ఎరువులు, విత్తనములను ఒకేసారి వేయడానికి ఉపయోగ పడుతుంది. ముఖ్యముగా వేరుశనగ, జొన్న పంటలకు చాలా ఉపయోగకరం. మీటరు సౌలభ్యం వుంది. నిర్ణయించిన మేరకు వేయవచ్చును. రైతులు దీనిని అద్దెకు ఇవ్వడానికి కూడా ఉపయోగించవచ్చును.



9. పళ్ళ చక్రాల దంతి :

మెట్ట భూములలో ఒకే వరుసలో అంతర వ్యవసాయ మునకు పనికి వస్తుంది. పంట వరుసల మధ్యన ఉన్న కలుపు మొక్కలను తొలగించి భూమిని వదులు చేయుటకు ఉపయోగపడుతుంది. ఒక మనిషి తేలికగా నడప వచ్చును. స్త్రీలు కూడా నడపటానికి సులభంగా వుంటుంది. రోజుకు 1/2 ఎకరము భూమి నుండి 2 నుండి 3 సెం.మీ. లోతు వరకు వదులు చేయుటకు, కలుపు తీయుటకు అనుకూలంగా వుంటుంది.

10. ఎ.పి.ఎ.యు. దమ్ము నాగలి :

వరి భూములను దమ్ము సాగు చేయుటకు ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయంచే రూపొందించ బడినది. దానికి ఒక జత ఎద్దులు సరిపోతాయి. రోజుకు రెండు ఎకరములలో నీటిలో దున్నిన మట్టి పెళ్లలను పగుల గొట్టి, భూమిని చదును చేసి నీటిని లోతుగా ఇంకకుండా నివారిస్తుంది.



11. వరినాట్ల యంత్రం :

చేతితో నారుమడి నుండి తీసిన వరినాట్లు వేయడానికి ఉపయోగపడుతుంది. దీనికి 10-12 హార్స్ పవర్ కల్గిన పవర్ టిల్లర్‌తో ఉపయోగించ వచ్చును. నాట్లు ఎనిమిది వరుసలలో వేయవచ్చును. రోజుకు 2 నుండి 3 ఎకరముల నాట్లు వేయవచ్చును. ఈ యంత్రాన్ని ఉపయోగించడానికి ముగ్గురు మనుషులు అవసరం. దీనిలో విశేషమేమిటంటే ఒక క్రమముగా వరుసలో వరినాట్లు వేయుటకు, మొక్కల మధ్య దూరమును క్రమ బద్ధంగా వేయుటకు ఉపయోగపడును. మరియు గ్రామీణ యువకులకు, స్వయం ఉపాధి కల్పన క్రింద దీనిని ఉపయోగించి అధిక లాభం పొందవచ్చును.



మనసు ఫౌండేషన్

పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	RVV01 A 117
పుస్తకం పేరు	[illegible]
తారీఖు	22/8/23
ముందు అట్ట	yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	29
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	No
లేని పేజీలు	No
తయారు చేసినది	Sandhya
పేజీలు విడదీసినది	sandhya
స్కాన్ చేసినది	Sandhya
పరీక్ష చేసినది	Amrutha
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యనివి	
తప్పులు	No
పరిస్థితి	good